# ప్రాణాలతో చెలగాటం !

శ్యాంబాబు

ఈ లోకంలో నాకు ప్రియమైనవి మూడే మూడు. నా భార్య దేవి, మా బేబీ, ప్రిన్స్ ఖార్టూమ్.

దేవితో ఎనిమిదేళ్ళ నా ప్రణయానికి చిహ్నం బేబి. బేబి కడుపులో పడగానే మేం పెళ్ళిచేసుకొన్నాం. ఆరేళ్లు ఇప్పుడు బేబీకి. తల్లిని మించిన అందం, నన్ను మించిన తెలివితేటలు దానికున్నాయి.

ప్రిన్స్ ఖార్టూమ్ నేను ఎంతో ముచ్చటపడి ఓ అరబ్ ట్రైనర్ దగ్గర కొనుక్కున్న రేస్ గుర్రం. బేబీకి అదంటే చాలా ఇష్టం!

ఆ రోజు రేస్‌కి నేను, దేవి మాత్రమే బయలుదేరాము. బేబీకి ఒంట్లో బాగులేక ఇంట్లోనే ఉండిపోయింది.

అనౌన్సర్ ఫైనల్ కాల్ ఇస్తున్నాడు. గ్యాలరీ రెయిలింగ్ దగ్గరకు రాగానే జనం ప్రక్కకు కదిలి మాకు చోటిచ్చారు. నేను, దేవి లోపలకు వెళ్ళాం.

దూరంగా రేస్ స్టార్టింగ్ పాయింట్ దగ్గర రేస్ గుర్రాలన్నీ ఇచ్చిన నెంబర్ల ప్రకారం వరసలో నిలబడివున్నాయి. ప్రిన్స్ ఖుర్టూమ్ నంబర్ ఎనిమిది. నా లక్కీ నెంబరు. నా పిక్చర్లు మొదలుపెట్టడం, విడుదల చెయ్యడం ఎనిమిదవ తారీఖునే చేస్తుంటాను. గమ్మత్తయిన సెంటిమెంటు. బేబీ పుట్టిందికూడా ఎనిమిదినే.

రేసు మొదలయింది.

పద్నాలుగువందల మీటర్ల రేసు. దాదాపు మూడు రౌండ్లు వెయ్యాలి రేస్ కోర్స్ చుట్టూ. రిఫరి పిస్టల్ షాట్ వినగానే గుర్రాలన్నీ ఒక్క వుదుటున ముందుకు దూకినయ్. జనం గోలగోలగా అరుస్తున్నారు. బైనాక్యులర్స్‌తో జాగ్రత్తగా గుర్రాల్ని చూస్తున్నాను.

రీగల్ బర్డ్ సగం రౌండ్ పూర్తవ్వకముందే లీడ్ తీసుకొంది. దాని వెనకాల నెంబర్ త్రీ 'మిడ్ నైట్ కౌబాయ్' దానికి దగ్గరగా 'రాయల్ మైకా', ఈ మూడిటికి వెనకాల 'ప్రిన్స్ ఖుర్టూమ్' పరిగెడుతున్నాయి.

పవర్‌ఫుల్ బైనాక్యులర్స్‌లో జాకీ ముకుంద్ ముఖం మీది నవ్వు కనిపిస్తోంది నాకు. కావాలని 'ప్రిన్స్'ను ఎక్కువ వేగం పోకుండా మిగతా వాటితో సమానంగా పోనిస్తున్నాడని, చెవులకు దగ్గరగా కళ్ళెంపట్టుకొన్న అతని పొజిషన్ చెపుతోంది. చివరి రెండువందల మీటర్లలో ఫుల్‌స్పీడ్ వదిలేస్తాడు... ఫస్టురౌండ్ పూర్తయింది.

ఇంకా రీగల్ బర్డ్ లీడింగ్‌లోవుంది. 'ప్రిన్స్ ఖుర్టూమ్' మూడవస్థానంలో పరిగెడుతోంది.

"కీపిటప్ రీగల్ బర్డ్!"_అరిచారెవరో గుర్రాలు గ్యాలరీ

ముందు పరిగెట్టినప్పుడు.

"కమాన్ జయంతీ బీటిట్" — ఎవరో నా వెనక గొంతు చించుకుని అరుస్తున్నారు.

మళ్ళీ ట్రేక్ వైపు చూశాను. నెంబర్ వన్ జయంతి అన్నిటికన్న వెనక పరిగెడుతోంది. నవ్వుకొన్నాను మళ్ళీ బైనాక్యులర్స్ ముందువున్న గుఱ్ఱాలమీద ఫోకస్ చేస్తూ. రెండవ రౌండ్ అయిపోయింది. జనంలో కోలాహలం ఎక్కువయింది. అరుపులు, కేకలు, ఈలలు రేస్ కోర్స్ మారుమ్రోగిపోతోంది.

రీగల్ బర్డ్, ప్రిన్స్ ఖుర్షూమ్ రెండూ సమానంగా పరిగెడుతోన్నయ్. చివరి వందమీటర్లు దగ్గరపడినయ్. టెన్షను పెరిగిపోతోంది. సడన్ గా బైనాక్యులర్స్ లోనుండి చూడలేకపోయాను.

రీగల్ బర్డ్, ప్రిన్స్ కన్నా ఓ 'మెడదూరం' ముందు పరిగెడుతోంది. లాస్ట్ పదిమీటర్లు. ముకుందు రెండుకాళ్ళతో 'ప్రిన్స్' ముందుకాళ్ళ ముందు తన్నడం స్పష్టంగా కనిపించింది. ప్రిన్స్ ఖుర్షూమ్ ఒక్క గెంతులో ముందుకెదూకింది. క్షణంలో రీగల్ బర్డ్ ను దాటి 'ఫోటో ఫినిష్' పాయింట్ దాటింది.

జనం కేకలతో ఒక్కసారి రేస్ కోర్స్ దద్దరిల్లిపోయింది. ఆనందం పట్టలేక తెలియకుండానే గట్టిగా అరిచాను. ప్రిన్స్ ఖుర్షూమ్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా గోల్డ్ కప్ గెలిచింది. చటుక్కున దేవిని దగ్గరకు లాక్కొని బుగ్గమీద గట్టిగా ముద్దుపెట్టుకొన్నాను.

## 2

రాత్రి పదింటికి 'హోటల్ మూన్ లైట్'లో కాక్ టైల్ పార్టీ ఇస్తున్నాను ఖుర్షూమ్ గెలుపు సందర్భంగా.

షేవ్ చేసుకొని, స్నానం పూర్తిచేసి డ్రెస్ చేసుకొంటున్నాను. బేబీ మేం రేస్‌కోర్స్‌నుండి ఇంటికిరాగానే లేచి నాతో కాసేపు కబుర్లు చెప్పి ఒంట్లో బాగులేక మళ్ళీ నిద్రపోయింది.

టైముడి వేసి, కోటు తొడుక్కొని ఓసారి అద్దంలో ప్రతిబింబాన్ని తృప్తిగా చూసుకొన్నాను.

బయట ఎవరో కాలింగ్ బజర్ నొక్కిన చప్పుడు వినిపించింది. సిగరెట్ వెలిగించి బెడ్‌మీద కూర్చున్నాను, ఈ సమయంలో ఎవరొస్తారా అని అనుకొంటూ.

నాయర్ గది గుమ్మం దగ్గరకువచ్చి నిలబడ్డాడు. "మీ కోసం ఎవరో వచ్చారు. ఏదో అర్జంటు విషయం మాట్లాడాలట. పేరు చెప్పలేదు," అన్నాడు.

"బయటికి వెళుతున్నాననీ, ఇప్పుడెవరితో మాట్లాడననీ చెప్పలేదా?" అన్నాను విసుగ్గా.

నాయర్ ఆ విషయం చెప్పి, ప్రయోజనం లేకే నా దగ్గరకి వచ్చాడని తెలుసు. కాని ముక్కు మొహం తెలియని వాళ్ళతో మాట్లాడుతూ కూర్చొని పార్టీకి లేట్‌గా వెళ్ళడం ఇష్టంలేదు.

"చెప్పాను సార్! వినడంలేదు. నన్ను తోసుకొని జబర్దస్తీగాలోపలకొచ్చి హాల్లో సోఫాలో కూర్చున్నాడు" అన్నాడు నాయర్ నిస్సహాయంగా.

వళ్ళు మండింది నాకు. నా ఇంట్లో దౌర్జన్యం చెయ్యడానికి ఎన్నిగుండెలు వాడికి.

మెట్లుదిగి హాల్లోకి వస్తూ అతన్ని జాగ్రత్తగా పరిశీలించాను.

కొద్దిగా ఎండకు మాడినట్లు కనిపిస్తోన్న ఎర్రని ఒంటి రంగు. గిరజాల జుట్టు పొడుగ్గా పెంచాడు. నున్నగా గీసిన గెడ్డం. మీసాలు, దట్టమైన కనుబొమలక్రింద నల్లరాతి

ముక్కులాంటి కళ్ళు. సూది ముక్కు, నవ్వుతోన్న పెదిమలు, ఓపెన్ టీషర్ట్, కాఫీకలర్ బెల్ బోటమ్ ప్యాంటు వేసుకొన్నాడు. కాళ్ళకి నల్లని బ్రాడ్ టో ఏంకిల్ బూట్సులు. నిలబడితే ఆరడుగుల పొడవుండొచ్చు.

మెట్లక్రింద చివరిమెట్టుమీద నిలబడి అతనివైపు తీక్షణంగా చూశాను క్షణంసేపు. అతను నవ్వుతూ లేచి నిలబడ్డాడు. "కంగ్రాచ్యులేషన్!" అన్నాడు ఒకడుగు ముందుకువేసి. ఆరడుగులపైన వున్న పొడుగు. పొడుక్కు తగ్గలావు. టీషర్ట్‌లోనుండి పొంగుతోన్న ఛాతీ, జబ్బలు, అతన్నిచూసి నాయర్ భయపడ్డంలో ఆశ్చర్యంలేదు.

"థాంక్స్!" అన్నాను ఆటోమాటిక్‌గా.

"అయామ్ సింగ్వీ! ఫ్రమ్ కలకత్తా!" అన్నాడతను చెయ్యి చాపుతూ.

"గ్లాడ్ టు సీ యు!" అన్నాను చేయి కలిపి షేక్ హాండ్ ఇస్తూ.

శరీరంలో శక్తిఅంతా అతని వేళ్ళమధ్య వుందనిపించింది. ఆకళ్ళలోకి చూస్తే ఎందుకో ఒళ్ళు జలదరించింది.

"మిస్టర్ చక్రవర్తి! మీ ప్రతిభ గురించి చాలా విన్నాను. మీతో మాట్లాడాలి" అన్నాడతను సిగరెట్ పీల్చి ముక్కు రంధ్రాల్లోంచి పొగవదుల్తూ.

"సారీ! ఇప్పుడు టైమ్‌లేదు. అర్జెంటుగా పార్టీకి వెళ్ళాలి. రేపురండి మాట్లాడుదాం!" అన్నాను అతన్ని పరిశీలనగా చూస్తూ. ఇతను నాతో ఏం మాట్లాడాలి?

అతను నవ్వాడు. "సారీ నాకూ టైమ్‌లేదు. ఇప్పుడే మాట్లాడాలి" అన్నాడు.

ఇతరుల ఆజ్ఞలకు లోబడడం నాకు అలవాటులేదు. "ఏమిటి మీరు మాట్లాడాల్సిన విషయం?" అన్నాను కొద్దిగా కటువుగా.

"మీ శ్రేయస్సుకి, మా శ్రేయస్సుకి సంబంధించిన విషయం. మీరు బంగ్లాదేశ్ లో తీయబోయే సినిమా లొకేషన్ విషయం."

అతనివంక ఆశ్చర్యంగా చూశాను. "ఇంకా స్క్రిప్ట్ తయారుకాలేదు. అది పూర్తయితేగాని లొకేషన్ విషయం ఆలోచించం" అన్నాను.

"ఆ విషయం తెలుసు. అందుకే వచ్చాను. బంగ్లాదేశ్ విముక్తి పోరాటం గురించి సినిమా తీసేప్పుడు సినిమా బంగ్లాదేశ్ లో కాక మరెక్కడ తీస్తారు?" అన్నాడతను నవ్వి.

నేను విసుగ్గా చేతి గడియారంవంక చూసుకున్నాను. మరో పదినిముషాల్లో పార్టీ మొదలవ్వాలి. "సారీ మిస్టర్ సింగ్వీ! ఇప్పుడు మీతో నేనేమీ చర్చించలేను. నా సినిమా లొకేషన్ విషయంలో మీ ఇంట్రస్టేమిటో అర్థం కావడంలేదు. దయచేసి తర్వాత కలుసుకోండి" అన్నాను అతన్నిక వెళ్ళమని సూచిస్తూ.

దేవికూడా అప్పుడే మెట్లుదిగి హాల్లోకి వచ్చింది. సింగ్వీ కదల్లేదు. నా వంక తీక్షణంగా చూశాడు. అతని చూపుల్లో ఏదో తెలియని క్రూరత్వం కనిపిస్తోంది. నాయర్ హాలు తలుపులు బార్లా తెరిచాడు.

సింగ్వీ సిగరెట్ నేలమీద కార్పెట్ పైవేసి బూట్ కాలితో నలిపాడు. చటుక్కున తలెత్తి విచిత్రంగా నవ్వాడు.

"ఆల్ రైట్ చక్రవర్తీ సీ యు సూన్!" అన్నాడు చకచక బయటికి నడుస్తూ.

"ఎవరతను?" అడిగింది దేవి, సింగ్వీ వెళ్ళిన వైపే చూస్తూ.

"ఎవరో సింగ్వీ! బంగ్లాదేశ్ లొకేషన్స్ గురించి మాట్లాడాలంటాడు" అన్నాను సాలోచనగా.

# 3

ఇష్టం లేకపోయినా పార్టీకి పదినిముషాలు లేటుగా వెళ్ళాల్సి వచ్చింది. అప్పటికే అతిథులందరూ 'హోటల్ మూన్ లైట్' రూఫ్ గార్డెన్ లో కులాసాగా కబుర్లు చెప్పుకొంటూ వున్నారు.

పార్టీ హుషారుగా సాగిపోయింది. 'రాయల్ సెల్యూట్' నెంబర్ వన్ స్కాచ్ విస్కీ, లోపలకు వెళుతోంటే గుండెల్లోంచి హుషారు తన్నుకొస్తోంది. గంటలు నిముషాల్లా గడిచాయి.

బేరర్ వచ్చి ఎవరో టెలిఫోన్ లో అర్జెంటుగా పిలుస్తున్నారని చెప్పాడు. విసుక్కుంటూ టెలిఫోన్ దగ్గరకు నడిచాను.

"యస్! చక్రవర్తి స్పీకింగ్!"

చిత్రమైన నవ్వు వినిపించింది అవతలివైపునుండి.

"హలో డైరెక్టర్! ఎలావుంది పార్టీ?"

ఆ గొంతు వినగానే ఎందుకో తెలియకుండానే వెన్నులోనుండి వణుకుపుట్టింది. సింగ్వీ కంఠాన్ని వెంటనే గుర్తించాను నేను.

"ఎందుకు పిలిచావు?" అన్నాను. నా గొంతు నాకే చిత్రంగా ధ్వనించింది.

"చెప్పానుగా! బంగ్లాదేశ్ లో నీ సినిమా లొకేషన్ గురించని."

"ఏమిటనీ?"

"నీ లొకేషన్స్ కుష్టియా ప్రాంతాల్లోనూ, కుల్నా ప్రాంతాల్లోనూ తీయాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది."

"ఎవరు చెప్పారు?"

మళ్ళీ అదే నవ్వు. "నువ్వు ఆ లొకేషన్స్ మానెయ్యాలి. కొమిల్లా ప్రాంతంలో షూటింగ్ కు ఏర్పాట్లు చెయ్యి."

"అబ్సర్డ్! కథకూ కొమిల్లా ప్రాంతానికీ సంబంధం లేదు. అయినా నేను సినిమా ఎక్కడ షూటింగ్ చేస్తే నీకేమిటి?" అన్నాను కోపంగా.

"వాటీజ్ అబ్సర్డ్ అబవుట్ ఇట్! ఖుల్నాకి, కొమిల్లాకు తేడా ఏమిటి? రెండూ బంగ్లాదేశ్ లోని ఊళ్ళేగా."

"యు ఆర్ క్రేజీ! మరోసారి ఇలా వేధించావంటే పోలీసుల్ని పిలుస్తాను" అన్నాను గట్టిగా.

సింగ్వీ అవతలనుండి నవ్వాడు. "అలాగే పిలువ్! ఈలోగా నీ కూతురి శవం నీ ఇంటిముందు పడివుంటుంది."

ఎందుకో గుండె ఝల్లుమంది. "రాస్కెల్ ఏమిటి వాగుతున్నావ్?"

"యస్! నీ బేబీ ఇప్పుడు మా చేతుల్లో వుంది. వెంటనే ఇంటికివెళ్ళి చూసుకో. పోలీసులను ఇందులోకి లాగితే నష్టపోయేది నువ్వే" ఫోను పెట్టేసిన శబ్దం వినిపించింది.

## 4

"వాళ్ళు తీసుకెళ్ళారు సార్! బేబీని, ఆయాను స్పృహ పోగొట్టి కారులో తీసుకెళ్ళారు" అన్నాడు నాయర్ నోటికి అంటించిన టేపు ఊడదీయగానే గొల్లున ఏడుస్తూ.

"ఎవరు వాళ్ళు?"

"వాడే సార్! మీరు పార్టీకి వెళ్ళబోయేముందు వచ్చిన సింగ్వీ! మరొకతను_"

చటుక్కున టెలిఫోన్ దగ్గరికి నడిచాను. పోలీస్ కమీషనర్ నా మిత్రుడు. చకచకా అతని నెంబరు

డయల్ చేశాను. దేవి నా చేతులో రిసీవర్ లాక్కొని క్రేడిల్ చేసింది తటాల్న.

"వద్దు చక్రీ! తొందరపడి ఏమీ చేయవద్దు!" అంది.

ఒక్క క్షణం తీక్షణంగా చూశాను దేవివైపు. "మనం త్వరగా ఏదో చెయ్యకపోతే బేబీ మనకు దక్కక పోవచ్చు."

దేవి కళ్ళలో నీళ్ళు నిండాయి. "మనం తొందరపడి ఏమన్నా చేసినా బేబీని మళ్ళీ చూడలేకపోవచ్చు. ఆ సింగ్వీ కళ్ళల్లో క్రౌర్యం నేను మరచిపోలేదు."

దేవి ఎప్పుడూ సమస్యల్ని నిదానంగా, లోతుగా ఆలోచిస్తుంది. ఆ విషయం నాకు తెలుసు. ఈ పరిస్థితిలో దేవి నిర్ణయం సరైనదని తెలుసు. అయినా బేబీ ఆ దుర్మార్గుల చేతుల్లో వున్న విషయం కోపాన్ని, భయాన్ని గుండెల్లో పాదరసంలా పైకి తన్నుతోంది.

వెనక్కి నడిచి నాయర్ కాళ్ళకు చేతులకు కట్టిన తాళ్ళు ఊడదీశాను. తాళ్ళు బిగుసుకొన్న చోట చర్మం చిట్లి రక్తం వస్తోంది. గూర్ఖా స్పృహతప్పి గేటు ప్రక్కన పడివున్నాడు.

"ఏం జరిగిం దసలు?" అన్నది దేవి.

"మీరు వెళ్ళాక హాలు తలుపులు మూసి, భోజనం చేసి పడుకొన్నాను. ఓ గంట క్రితం ఎవరో తట్టి నిద్రలేపారు. కళ్ళు తెరిచానో లేదో, సింగ్వీ మరొకతను మీదపడి నా కాళ్ళు చేతులు కట్టేశారు. ఒకడు అరవడానికి వీల్లేకుండా నోరుమూసి, రెండు చేతులూ గుండెలమీద పెట్టి పైనపడి అదిమిపడితే, సింగ్వీ కాళ్ళూ చేతులు కట్టేసి, నోటికి టేప్ అతికించాడు. తర్వాత భుజంమీద మోసుకెళ్ళి యీ సోఫావెనకాల పారేశారు. తర్వాత పైకివెళ్ళి ఆయాను, బేబీని తీసుకెళ్ళారు."

''ఎలా తీసుకెళ్ళారు? తీసుకెళుతుంటే ఎవరూ అరవ లేదా?''

''నాకు కనుపించలేదు. సోఫా వెనకాలనుండి బయటికి కెళుతున్న శబ్దం మాత్రం వినిపించింది.

హాల్లో టెలిఫోన్ మ్రోగింది. ఒక్క గంతులో వెళ్ళి రిసీవర్ అందుకొన్నాను.

''హలో చక్రవర్తీ! ఎలావుంది ఇంటిదగ్గర?'' సింగ్వీ గొంతు వినగానే మళ్ళీ నాలో కోపం కట్టలు తెంచుకొంది.

''యు డర్టీ బాస్టర్డ్! బేబీని ఎక్కడకు తీసుకెళ్ళావ్?'' అరిచాను.

ఫోన్లో సింగ్వీ నవ్వు వినిపించింది. ''నీ బేబీ, బేబీ తాలూకు ఆయా క్షేమంగా వున్నారు. మేం చెప్పినట్లు చేస్తే వాళ్ళకు ఏ ప్రమాదమూ రాదు.''

''ఏమిటది?''

''చెప్పానుగా! నీ నెక్స్ట్ పిక్చర్ లొకేషన్ కొమిల్లాలో తియ్యాలి.''

''అలాగే'' అన్నాను. పిక్చరు ప్రారంభించడానికి ఇంకా రెండు నెలలపైన పడుతుంది.

''డోన్ట్ బి సిల్లీ చక్రవర్తీ! నువ్వు అలాగే అన్నంత మాత్రాన బేబీని వదిలేస్తామనుకోకు. పిక్చరుకి ఇంకా స్క్రిప్టు తయారుకాలేదని చెప్పావు.''

''అవును.''

''స్క్రిప్టు తయారయినా అవకపోయినా నీవు వెంటనే కొమిల్లాకు షూటింగ్‌కు బయలుదేరాలి.''

''ఇటీజ్ ఇంపాజిబుల్! వెంటనే వెళ్ళడం అసంభవం'' సింగ్వీ ఉద్దేశ్యమేమిటో అంతుబట్టడంలేదు.

దేవి, నాయర్ నా ప్రక్కనే నిలబడి సంభాషణంతా

శ్రద్ధగా వింటున్నారు.

"చక్రవర్తీ ప్రభుత్వంలోనూ, పరిశ్రమలోనూ నీకున్న పలుకుబడి సంగతి నాకు తెలుసు."

"అయినా కష్టం! డబ్బు చూసుకోవాలి. లొకేషన్‌కు బంగ్లాదేశ్ ప్రభుత్వం అనుమతి తీసుకోవాలి. యూనిట్ అంతటికీ పాస్‌పోర్ట్‌లు తెప్పించాలి. వెంటనే బంగ్లాదేశ్‌కు వెళ్ళడం అసంభవం."

"ఇక్స్‌పెక్టీ చక్రవర్తి! నీ మాటలు చిన్న పిల్లాడికి కూడా నవ్వు తెప్పిస్తాయి. లొకేషన్ దగ్గరకు నీ యూనిట్ అంతా వెళ్ళాల్సిన అవుసరంలేదు. లొకేషన్ సర్వే కోసం పిక్చర్ డైరెక్టర్, కెమెరామాన్‌లు, అసలు షూటింగ్ జరగబోయేముందు వెళ్ళడం మామూలే. మనమూ అలాగే వెళతాము. నీవు నిజానికి కొమిల్లాలో షూటింగ్ చేయబోవడంలేదు. లొకేషన్ సర్వే చెయ్యబోతున్నావు."

"వాట్ డు యు మీన్? మనము అంటున్నావు. పిక్చర్ ప్రొడక్షన్ గురించి నీకేం తెలుసు?"

"యస్ చక్రవర్తి మనమే వెళ్ళేది. నీ నెక్స్ట్ పిక్చర్ షూటింగ్ లొకేషన్ కోసం, నీవు, నీ కెమెరామేన్‌గా నేను, అసోసియేట్ డైరెక్టర్‌గా నా మిత్రుడు. ముగ్గురం బంగ్లాదేశ్ వెళతాము. నీతోపాటు, మా ఇద్దరికి పాస్‌పోర్ట్‌లు తెప్పించాల్సిన బాధ్యత నీది."

"మీ అంతట మీరే బంగ్లాదేశ్ ఎందుకు వెళ్ళకూడదు?"

"వెళ్ళలేకనే ఇలా చేయవలసి వస్తోంది. నీ చిత్రాలకు బంగ్లాదేశ్‌లో మంచి గిరాకీ వుంది. ఆ దేశంలో కూడా నీకు మంచి పేరుంది. నీ సిబ్బందిగా మేంవస్తే మమ్మల్నెవరూ అనుమానించరు. ప్రశ్నించరు. నువ్వు మమ్మల్ని మోసం చెయ్యకుండా మనం బంగ్లాదేశ్ వెళ్ళి తిరిగొచ్చేవరకూ

నీ బేబీ మా దగ్గరే వుంటుంది. యు హేవ్ నో ఛాయిస్ చక్రవర్తీ! బాగా ఆలోచించుకో. మేం చెప్పినట్లు చేస్తే నీ బేబీ నీకు ప్రాణాలతో దక్కుతుంది" సింగ్వీ కంఠంలో పరిహాసం ధ్వనిస్తోంది.

"యు డర్టీ బ్లాక్ మెయిలర్! యు బ్లడీ స్వైన్" బేబీ మాట వినగానే నా నోటమ్మట ధారాళంగా తిట్లు రాసాగాయి.

"కోపగించి, ఉద్రేకపడి లాభంలేదు చక్రవర్తీ! ఆలోచించు. రేపు ఉదయం పదిగంటలకు ఫోన్ చేస్తాను మళ్ళీ" అవతల ఫోన్ పెట్టేసిన శబ్దం వినిపించింది.

## 5

మిగిలిన రాత్రంతా సిగరెట్లు కాలుస్తూ, ఏం చెయ్యాలో ఆలోచిస్తూ చాలా భారంగా గడిచింది.

దేవి నాతోపాటే సోఫాలో కూర్చొని నాకు ధైర్యం చెపుతూ కూర్చుంది. జరిగిన విషయం ఏరకంగానూ ఎవరికీ తెలియకూడదని గూర్ఖానీ, నాయర్‌నీ తీవ్రంగా హెచ్చరించాను.

ఎవరీ సింగ్వీ? బంగ్లాదేశ్‌లో అతని ఇంట్రస్టేమిటి? అతణ్ణి, అతని మిత్రుణ్ణి కొమిల్లా ప్రాంతాలకి తీసుకెళ్ళడానికి నన్నే ఎందుకు ఎన్నుకోవలసి వచ్చింది? కొమిల్లాకు వెళ్ళాలి? వెళ్ళకపోతే నిజంగానే బేబీని?? ఆలోచించలేక పోయాను.

హాలులో గడియారం అయిదు గంటలు కొట్టింది. బయట ఏదో కారు ఆగి, తిరిగి కదిలి వెళ్ళిపోయిన చప్పుడు వినిపించింది.

"సాబ్!" హాలు తలుపు తట్టిన చప్పుడు, గూర్ఖా కంఠస్వరం ఒకేసారి వినిపించాయి.

నాయర్ లేచివెళ్ళి హాలు తెరిచాడు. తలుపు అవతల

గూర్ఖా నిలబడి వున్నాడు. నాయర్ తలుపు తెరవగానే ఓ మధ్యరకం ట్రంక్ పెట్టెను మోసుకొచ్చి లోపల పెట్టాడు.

"ఏమిటది?" అడిగాను. నాకు తెలియకుండానే గుండెలు దడదడ కొట్టుకోవడం ప్రారంభించాయి.

"తెలియదు సాబ్! ఎవరో కార్లో వచ్చి ఈ పెట్టె మన గేటుకు ఎదురుగా పారేసి, ఓ కవరు మీకిమ్మని నా వైపు విసిరేసి వెళ్ళిపోయారు" అన్నాడు గూర్ఖా కవరు నా చేతికందిస్తూ.

ఓసారి పెట్టెవైపు పరీక్షగా చూసి, కవరు చింపాను. తెల్లని పావుతావు కాగితంమీద ఇంగ్లీషులో వ్రాయబడి వుంది. దాని సారాంశం ఇది.

డియర్ చక్రవర్తీ!

మమ్మల్ని గురించి, మా మాటల గురించి నీకు చాలా అనుమానాలు కలిగి బేబీ విషయంలో వెంటనే నీవో నిర్ణయానికి రాలేవేమోనని నీ కీ పెట్టె పంపిస్తున్నాను. పెట్టె తెరచి చూడు. నువ్వు వెంటనే ఓ నిర్ణయానికి రాగలవు.

సింగ్వా.

"ఏముంది ఆ పెట్టెలో?" అన్నది దేవి భయంగా ఆ ట్రంక్ పెట్టె వైపు చూస్తూ.

నేను మాట్లాడలేదు. మళ్ళీ ఓసారి పెట్టెను పరీక్షగా చూశాను. బజారులో ఎక్కడయినా దొరికే సామాన్య మయిన ట్రంక్ పెట్టె అది. క్రొత్తది కావడంవలన ట్యూబ్ లైట్ కాంతిలో నల్లగా నిగనిగా మెరుస్తోంది.

దగ్గరకు నడిచి హేండిల్ పట్టుకొని పైకెత్తాను. పెద్ద బరువుగాకూడా లేదు. 'థాంక్ గాడ్' అనుకొన్నాను మనసులోనే. గొళ్ళానికి మామూలు అల్యూమినియం రేకుతో చేసిన చిన్న తాళంకప్ప వ్రేలాడుతోంది,

నాయర్‌ని స్క్రూడ్రైవర్ తెమ్మని చెప్పి, స్క్రూ డ్రైవర్‌ను కొక్కానికి, తాళానికి మధ్య పెట్టి బలంగా వంచాను. చటుక్కున ఊడివచ్చింది తాళం. తాళంతీసేసి ఒక్క క్షణం ఆగాను.

ఏముందీ పెట్టెలో? బేబీకాని లేదుకదా? ఆ పాసిబిలిటి లేదని తెలుసు. పెట్టె బేబీ అంత బరువుగాలేదు. మరే ముంటుంది? పెట్టె మూత తెరవగానే ఏదైనా బాంబ్ పేలే ఏర్పాటు చెయ్యలేదుకదా? ఒక్కసారి తల విదిలించి గట్టిగా ఊపిరిపీల్చాను.

దేవి, నాయర్, గూర్ఖా నిలబడి కన్నార్పకుండా ఊపిరి బిగపట్టి చూస్తున్నారు.

మెల్లిగా పెట్టె మూత తెరిచాను. తెల్లని ఫ్లోరసెంట్ దీపంకాంతి పెట్టె లోపలిభాగానికి సూటిగా పడుతోంది. ఒక్క క్షణం ఊపిరి పీల్చడం మానేశాను. పెట్టెలోపల వున్నది చూడగానే కళ్ళు బైర్లుకమ్ముతున్నట్లు, కడుపులో త్రిప్పుతున్నట్లు అనిపించింది.

పైనుండి చూస్తున్న దేవి కెవ్వున కేకపెట్టి స్పృహ తప్పింది.

సగం తెరిచివున్న అల్చిప్పల్లాంటి నల్లటి కళ్ళు. నిగనిగ మెరుస్తోన్న నల్లని జుట్టు, శరీరంనుండి తల విడినచోట పెద్ద గాయం. నుదుటిమీది తెల్లని డైమండ్ రక్తంలో తడిసి ఎర్రబడింది. ప్రిన్స్‌ఖుర్రామ్! నిన్నటి రేస్‌కోర్స్ ప్రియుల ఆశాజ్యోతి! ఎందరికో అదృష్టాన్ని తెచ్చిపెట్టిన ప్రిన్స్ తల అది!

ఈ దుర్మార్గపు లోకంతో, ఏ రకంగానూ సంబంధం లేని ఎంతో విలువైన ప్రిన్స్‌ను కారణం లేకుండా అంత క్రూరంగా వాళ్ళు చంపారంటే, బేబీ ప్రాణం వాళ్ళకో లెక్కకాదు. ఆ విషయం గుర్తుచెయ్యడానికే వాళ్ళు

ప్రిన్స్ ఖాట్రూమ్‌ను చంపి దాని తలను నాకు పంపించారు.

అంతే! నేను వాళ్ళకు ఏ విధంగాను సహాయం చెయ్యాక తప్పలేదు, బేబీకోసం.

# 6

నాలుగురోజులకు ఘూనక్‌పూర్ బోర్డర్ చెక్‌పోస్టుదగ్గర మా కారు ఆగేప్పటికి సాయంత్రం నాలుగయింది. సరి కొత్త 'లాండ్‌రోవర్' కారు అది. డ్రైవింగ్ వీల్ దగ్గర గపూర్ కూర్చొని వున్నాడు.

కలకత్తాలోని ఓ బ్రిటిష్ కంపెనీ దగ్గర్నుండి 'లాండ్‌రోవర్'ను కొనగానే రెండురోజులు ఒంటరిగా షెడ్‌లో కూర్చుని కారులో చాలా మార్పులు చేశాడు గపూర్. పైకి చూడ్డానికి ఏం మార్పులు చేశాడో తెలియడంలేదు. కాని ఆటోమొబయిల్స్ గురించి అతనికి చాలా పరిజ్ఞానం వుందని అర్థంచేసుకొన్నాను.

మాముందు వరసగా దాదాపు ఇరవైవరకూ కార్లు, ట్రక్కులు నిలచి వున్నయ్. ట్రక్కులన్నిటిలోనూ సిమ్మెంటు బస్తాలు పేర్చివున్నాయి. బంగ్లాదేశ్ పునర్నిర్మాణానికి కావలసిన ఉక్కు, సిమెంటు, బొగ్గు, అనేక ఇతర వస్తువులు చాలావరకు భారత ప్రభుత్వమే సప్లయి చేస్తుంది. బహుశా ఈ ట్రక్కులు అలాంటివే అయ్యుండాలి.

చెక్‌పోస్టు అధికారులు ఈ ట్రక్కుల్నిమాత్రం త్వరత్వరగా పంపించివేస్తున్నారు. రోజూ సరిహద్దు దాటడం, తిరిగి రావడంవల్ల బాగా పరిచయం అయివుంటారు. సివిలియన్ వెహికల్స్‌ని మాత్రం జాగ్రత్తగా చూసి పంపిస్తున్నారు.

సాయంత్రం ఆరుగంటలకల్లా చెక్‌పోస్టులు మూసేస్తారు. మళ్ళీ ఉదయం ఆరుగంటలకే తెరచేది. అంతే

రాత్రిపూట ఎవరూ సరిహద్దు దాటివెళ్ళడానికి వీలులేదన్న మాట. అలసటగావున్న ఓ బోర్డర్ చెక్‌పోస్టు అధికారి మా దగ్గరికి వచ్చాడు.

“పాస్‌పోర్ట్స్ ప్లీజ్”—అన్నాడు డ్రైవర్ కిటికీ దగ్గర నిలబడి.

గపూర్ గ్లోవ్ కంపార్ట్‌మెంటు తెరిచి ముగ్గురి పాస్‌పోర్ట్‌లు, ట్రావెల్ పేపర్స్ అందించాడు. అతను పాస్‌పోర్ట్‌లో అతికించిన ఫోటోలు, మా ముఖాలు ఓసారి పరీక్షగా చూసి మూడు పాస్‌పోర్ట్‌లమీద ‘ఇనిషియల్’ చేసి ప్రక్కనే వున్న ఆర్డర్లీకి అందించాడు. గపూర్ ఇంజన్ స్టార్ట్ చేశాడు.

కారు కదిలి బంగ్లాదేశ్‌లో ప్రవేశించింది.

ఇండియన్ చెక్‌పోస్టుకి అవతల రెండుమూడు వందల గజాల దూరంలో బంగ్లాదేశ్ బోర్డర్ చెక్‌పోస్టు వుంది. మళ్ళీ కార్లు వరసగా ఆగివున్నాయి ఇక్కడ.

“డామిట్! ఎన్నిసార్లు చెక్ చేస్తారు?”—అన్నాడు సింగ్వీ విసుగ్గా సిగరెట్ వెలిగిస్తూ.

నేను మాట్లాడలేదు. మౌనంగా సిగరెట్ వెలిగించి ఒక్కొక్కటే కదుల్తోన్న కార్లవంక చూస్తూ కూర్చున్నాను.

మరో కొన్ని నిముషాల్లో మేము బంగ్లాదేశ్ ప్రవేశిస్తాము. ఎందుకు? అనే ప్రశ్నకు జవాబు నా దగ్గర లేదు. ఎవరీ సింగ్వీ, గపూర్లు అనేది నాకు తెలియదు. నేను తరచి అడిగినప్పుడల్లా నవ్వి వూరుకొంటున్నారు. బంగ్లాదేశ్‌లోకి ఎందుకు వెళుతున్నామో, అక్కడ ఏం చెయ్యాలో ఏమీ తెలియదు. దారితెలియని గుడ్డివాడిలావుంది నా పరిస్థితి.

కేవలం బేబీకోసం, బేబీని నాకు దక్కించుకోవడం కోసం నేనీ పని చెయ్యాల్సి వస్తోంది. బేబీని ఎక్కడో

దాచారు వాళ్లు. బంగ్లాదేశ్‌లో తమపని పూర్తిచేసుకొన్నాకే జేబీని వదలిపెడతామని, అలోగా జేబీ ఎక్కడుందో కనుక్కోవడానికి ప్రయత్నంచేసినా, వాళ్ళతో సరిగ్గా సహకరించకపోయినా, జేబీ తిరిగి మీకు దక్కదని పదేపదే బయలుదేరేముందు హెచ్చరించాడు సింగ్వీ.

పావుగంట తర్వాత లాండ్‌రోవర్ కదిలి బంగ్లాదేశ్ చెక్‌పోస్టుముందు ఆగింది. ఓ ఆఫీసరువచ్చి మా పాస్‌పోర్ట్‌లు తనిఖీ చేస్తుంటే, ఇద్దరు జవాన్లు మమ్మల్ని క్రిందకు దిగమని కారును క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

లాండ్‌రోవర్‌కు ముందువైపు, ప్రక్కల తెల్లని పెయింట్‌తో వ్రాయబడిన 'చిత్రాలయా మూవీస్' అనే అక్షరాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి.

నా పాస్‌పోర్ట్ మీది వివరాలు చదివి నావంక ఓసారి ఆశ్చర్యంగా చూశాడు చెక్‌పోస్టు అధికారి.

"గ్లాడ్ టు మీట్ యు చక్రవర్తీ! మీరు తీసిన 'రేప్ ఆఫ్ బంగ్లా' చూశాను. చాలా బావుంది"—అన్నాడతను చెయ్యిసాచి ఓ అడుగు ముందుకువేసి.

నేనతనివంక సంభ్రమంగా చూశాను. "థాంక్యూ వెరిమచ్!"—అన్నాను ఒక్కక్షణం ఏమనాలో తోచక.

"మళ్ళీ మరో సినిమా తీస్తున్నారని విన్నాను. ఎప్పుడు విడుదలవుతోంది?"—

"ఏమో! లొకేషన్ సర్వేకోసం వెళుతున్నామిప్పుడు"—

అతను మిగతా రెండు పాస్‌పోర్ట్‌లుచూసి, "ఈసారి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీనీ, కెమేరా మాన్‌ని మార్చినట్లున్నారే"—అన్నాడు సింగ్వీ, గపూర్‌లవంక చూస్తూ.

నవ్వాను అవునన్నట్లు. "నా పిక్చరు గురించి చాలా వివరాలు గుర్తున్నయ్ మీకు" అన్నాను.

అతను సిగ్గుపడుతున్నట్లు నవ్వాడు. "ఐయామ్‌యువర్ ఫాన్! మీ చిత్రం చూసి మీకు చాలా ఉత్తరాలు వ్రాశాను. మీరే దేనికీ సమాధానం వ్రాయలేదు. అఫ్ కోర్స్! ఐనో మీరు చాలా బిజీగా వుంటారని"—

ఈసారి కాస్త సిగ్గుపడడం నావంతయింది. "సారి! ఒక్కొక్కసారి ఫాన్ లెటర్స్‌కు జవాబివ్వాలన్నా సమయం చాలదు. ఈసారెప్పుడైనా తప్పకుండా వ్రాస్తాను. మీ పేరు చెప్పనేలేదు"—అన్నాను సిగరెట్ ఆర్పేసి.

"జాన్ చౌదరి. కెప్టెన్ జాన్ చౌదరి, ఫ్రాంటియర్ పోలీస్ ఆఫ్ బంగ్లాదేశ్."

నేను సింగ్వీవంక చూశాను. సింగ్వీ 'లాండ్ రోవర్'ని జాగ్రత్తగా వెతుకుతోన్న ఆ ఇద్దరు జవాన్లనే చూస్తున్నాడు. జవాన్లలో ఒకడు గుండ్రటి నెగటివ్ ఫిలిమ్స్ స్పూల్స్‌వున్న పెట్టెల్ని తెరవాలని ప్రయత్నిస్తున్నాడు.

"స్టాపిట్!"—అన్నాడు సింగ్వీ, "అవి అన్ ఎక్స్‌పోజ్డ్ ఫిలిమ్స్. తెరిస్తే పాడయిపోతాయి" అన్నాడు కోపంగా.

నిజానికి నెగటివ్ ఫిల్మ్ వుందన్న ఆ పెట్టెల్లో ఏముందో నాకూ తెలియదు. అలాంటి ఖాళీ పెట్టెలు ఆరింటిని నేనే సింగ్వీకి ఇచ్చాను. వాటిలో ఫిల్మ్ లేదని నేను ఖచ్చితంగా చెప్పగలను. చాలా బరువున్నాయి అవి.

జాన్ చౌదరి ఇంకా ఏమీ వెతకనవసరంలేదని, వెనక కారుసంగతి చూడమని ఆ ఇద్దరు జవాన్లను హెచ్చరించాడు.

"మిస్టర్ చక్రవర్తీ! మీరు రాత్రికి ప్రక్కవూళ్లో ఉంటారా... లేక జర్నీ కంటిన్యూ చేస్తారా?"—

నేను సింగ్వీవైపు చూశాను. "లేదు రాత్రంతా ప్రయాణం చేస్తాము. బహుశా ఉదయం ఆరింటికి శాలీఫూర్ చేరు

కొంటామనుకొంటాను''—అన్నాడు సింగ్వీ.

''మీ ఇష్టం. రాత్రికి ప్రక్క—పూళ్లో ఆగిపోయేట్లయితే జకీర్ లాడ్జిలో బస చెయ్యండి. ఆ లాడ్జి ఓనరు నా మిత్రుడు. నా పేరు చెపితే మీకు అన్నీ సక్రమంగా జరగేట్లు చూస్తాడు'' అన్నాడు చౌదరి డిస్‌పాయింట్ అయినట్లు.

''థాంక్యూ! బహుశా ఆ అవసరం ఉండదనుకొంటాను'' అన్నాను కదిలే కార్లోంచి చెయ్యి వూపుతూ.

## 17

కొమిల్లా—త్రిపుర సరిహద్దు మేప్ ఒళ్లో పెట్టుకుని సింగ్వీ దారి చెపుతోంటే గఫూర్ బంగ్లాదేష్ పాడయిపోయిన రోడ్లమీద చాలా చాకచక్యంగా లాండ్ రోవర్‌ను నడుపుతున్నాడు.

పాకిస్తాన్‌తో యుద్ధం ముగిసిన తరువాత భారత ప్రభుత్వ సహకారంతో చాలా త్వరత్వరగా అభివృద్ధి చెందుతోంది బంగ్లాదేశ్. పాకిస్తాన్ పాలకుల చేతుల్లో దేశం వున్నప్పుడు కేవలం సైనిక అవసరాలకు తప్ప వేరే విధంగా బంగ్లాను అభివృద్ధి చెయ్యడానికి వాళ్ళు ప్రయత్నించలేదు.

అసలే మెయింటెనెన్స్ సరిగాలేని సరిహద్దు రోడ్లు, యుద్ధం తరువాత గోతులతోను, ఎత్తుపల్లాలతోనూ ఉపయోగించడానికి వీలు లేకుండా తయారయినయ్.

కారులో వెళుతోంటే యుద్ధసమయంలో త్రవ్విన ట్రెంచ్‌లు, కూలిపోయిన బంకర్లు, నల్లగా మాడి మసిబారి పనికిరాకుండాపోయిన ఆర్మర్డ్ కార్లు, ట్రక్కులు రోడ్డంట గుట్టలు గుట్టలుగా కనిపిస్తున్నయ్. బంగ్లా స్వాతంత్ర్య సమరంలో, భారత సేనలు మొట్ట మొదట సరిహద్దులదాటి

పాక్ దురాక్రమణదారులను తరిమికొట్టింది కొమిల్లా ప్రాంతంలోనే.

యుద్ధం తాలూకు విషాద ఛాయలు బంగ్లాదేశ్ ను ఇంకా వదలిపోలేదు. [illegible] ఫ్రంట్ నుండి కొమిల్లా వరకూ దారంట పూర్తిగా శిథిలమైపోయిన అనేక వందల గ్రామాలు చూశాను నేను. ఇండియా నుండి వెనక్కి తిరిగివచ్చిన శరణార్థులు తిరిగి ఆ శిథిలాల్లోనే తాటిఆకుల కప్పుల క్రిందా తార్పాలిన్ల క్రిందా తలదాచుకొంటున్నారు.

కొమిల్లానుండి మూడుగంటలు ప్రయాణం చేసిన తరువాత కారు ఆపమన్నాడు సింగ్వీ. రోడ్ ప్రక్కనే వున్న రెండు పెద్దచెట్ల నీడక్రింద లాండ్ రోవర్ ని ఆపాడు కపూర్.

మధ్యాహ్నం ఒంటిగంట కావస్తోంది. ఎర్రని దుమ్ము ఒంటినిండా, బట్టలనిండా పేరుకుపోయింది. అప్పటి వరకూ విపరీతమైన ఎండలో ప్రయాణం చేయడం వలన చెట్ల నీడలో గాలి తగులుతోంటే హాయిగా ఉన్నట్టు తోచింది.

“ఇక్కడనుండి రోడ్ దిగి ఎడమవైపు డొంకదారంట వెళ్ళాలి మనం”—అన్నాడు సింగ్వీ మరోసారి మేప్ వైపు చూసుకొని.

“ఇంకా ఎంతదూరం వెళ్ళాలి మనం?” అన్నాను నేను సింగ్వీ చూపెట్టినవైపు దూరాన కనిపిస్తున్న కొండలవైపు చూస్తూ.

“మరో ఇరవై మైళ్లు వెళ్ళాలనుకొంటాను ఆ కొండల దగ్గరకు చేరాలంటే”—అన్నాడు సింగ్వీ.

“ఎందుకు అక్కడికి?”—అన్నాను వాటర్ కాంటీన్ మూతతీస్తూ.

సింగ్వీ నా మాట పట్టించుకోనట్లు గఫూర్ వైపు తిర గాడు.

"ఇక్కడ లంచ్ పూర్తిచేసి, ఓగంట రెస్టు తీసుకొని బయలుదేరదాం"—అన్నాడు.

గఫూర్ తలపూపి క్రిందకు దిగాడు. నేను ఏమీ పట్టనట్లు బుజాలు ఎగరేసి, కాసిని నీళ్లుత్రాగి సిగరెట్ వెలిగించాను.

లాండ్ రోవర్ కారు చూడ్డానికి జీపులావున్నా, దాని బాడీమాత్రం టు టన్నర్ ట్రక్ లా వుంటుంది. కొమిల్లా నుండి బయలుదేరేముందు మాకు కావలసిన ఆహార పదార్థాలు, విస్కీ,సిగరెట్లు, ఓ పదిలీటర్ల టిన్నునిండా మంచి నీళ్లు, మా ముగ్గురి వాటర్ కాంటిన్సనిండా నీళ్లు—అన్నీ సరిపడావుండేట్లు జాగ్రత్తపడ్డాడు సింగ్వీ.

ఈ ఏర్పాట్లుబట్టి కనీసం ఓ వారంరోజులపాటు జన సమ్మర్ధంలేని ప్రాంతాలకు వెళ్ళుతున్నామని అర్థమయింది నాకు. బహుశా, ఆ సరిహద్దు కొండలవైపు వెళతామను కొంటాను. ఎందుకు?

సింగ్వీ రెండు మందపాటి దుప్పట్లుతీసి చెట్టు మొదలు దగ్గర పరిచాడు. ఐస్ముక్కలున్న ఫ్లాస్క్, ఓ రెండు బీర్ బాటిల్స్, బ్రేన్ బ్రెడ్, టిన్డ్ చికెన్, వాటర్ కాంటీన్లు తీసుకొచ్చి వాటిమీద పెట్టాడు.

గఫూర్ స్టౌ బయటికితీసి, ఓ పాత్రలో టీకి నీళ్లు కాచడం మొదలుపెట్టాడు.

సింగ్వీ మూడు గ్లాసుల్లో ఫ్లాస్క్ లోనుండి ఐస్ క్యూబ్స్ తీసివేసి, బీరుపోసి అందరికీ అందించాడు. ఐస్ చల్లబడిన బీరు గొంతులోనుండి చల్లగా కడుపులోకి వెళుతోంటే హాయిగావుంది. బీర్ అయిపోయాక బ్రెడ్ చికెన్ తిని టీ త్రాగి ముగ్గురం సిగరెట్లు వెలిగించాము.

సింగ్వీ చెట్టు మొదలుకు ఆనుకొని మేప్ ను జాగ్రత్తగా పరిశీలిస్తూ ఏదో టిక్ చేస్తున్నాడు. నేను గఫూర్ వైపు చూశాను. హాయిగా చెట్టునీడలో కళ్లుమూసుకొని పడుకొని సిగరెట్ కాల్చుకొంటున్నాడు.

వాళ్ళిద్దరిలో కావలిసినంత తేడా కనిపిస్తోంది పైకి చూడ్డానికి. పొట్టిగా, బలంగా కండలు తిరిగిన శరీరంతో తక్కువ మాట్లాడుతూ చెప్పినపని చురుగ్గా చేసుకుపోతున్నాడు గఫూర్. ఈ మూడురోజుల ప్రయాణంలో చాలా అలిసిపోయాను నేను. కారు రియర్ వ్యూ అద్దంలో ముఖం చూసుకొంటే నల్లబడి, కళ్ళులోతుకువెళ్ళి ఎంతో అలసట చెందినట్లు కనిపిస్తున్నాను.

సింగ్వీ, గఫూర్ లు మాత్రం, ఇల్లాంటి జీవితాలకు అలవాటు పడినవాళ్ళలా ఏమాత్రం అలసట కనిపించకుండా హుషారుగా వున్నారు. కొమిల్లా వదిలిన దగ్గరనుండీ వాళ్ళిద్దరిలో చిత్రమైన మార్పు కనిపించింది. ఒకప్రక్క ఏదో చెయ్యబోతున్నాము అనే ఉత్సాహం, తెలియని టెన్షన్, వాళ్ళలో క్షణక్షణానికి పెరుగుతున్నట్లు గమనించాను నేను.

ఏమిటి కారణం? ఇన్ని ఘోరాలు చేసి, నన్నింత లోబరుచుకొని కొమిల్లాకు రావడానికి కారణమేమిటి? ఎవరు వీళ్ళిద్దరూ? ఇక్కడనుండి కదలబోయేముందే సింగ్వీతో ఈ విషయం తేల్చుకోవాలని నిశ్చయించుకొన్నాను.

లంచ్ పూర్తయిన సరిగ్గా ఓగంటకు సింగ్వీ లేచి నిలబడ్డాడు.

"ప్లీజ్ సిడౌన్ సింగ్వీ! నేను నీతో మాట్లాడాలి"— అన్నాను కళ్లు తెరిచి, సిగరెట్ వెలిగిస్తూ.

సింగ్వీ నొసలు ముడతలు పడింది. "ఏమిటది?"— అన్నాడు.

"మనం ఎక్కడకు వెళ్ళబోతున్నది చెప్పలేదు నువ్వు" అన్నాను గట్టిగా సిగరెట్ పొగ పీల్చి వదుల్తూ.

"చెప్పానుగా! సరిహద్దులో వున్న కొండల వైపు వెళ్ళాలి"—అన్నాడు విసుగ్గా.

"ఆ కొండలంతా విప్లవ నాగాలతో నిండివున్నాయని అక్కడికి వెళ్ళడం మంచిదికాదని కమిషనర్ కూడా చెప్పాడు"—అన్నాను కూర్చున్న చోటునుండి ఏమాత్రం లేచే ప్రయత్నం చెయ్యకుండా.

చిత్రంగా నవ్వాడు సింగ్వీ. ఆ నవ్వులో తల బిరుసుతనం, తెలియని క్రూరత్వం కనిపిస్తున్నాయి.

"విప్లవ నాగాలు మనల్నేం చెయ్యరు. వాళ్ళు పోట్లాడవలసింది మనతో కాదు"—అన్నాడు సింగ్వీ సామాన్లు ఒక్కొక్కటే కారు బాడీలో పెట్టడానికి తీసుకెళుతూ.

అతని ఇండిఫరెన్సు, తలబిరుసుతనం చూసి ఒక్క క్షణం ఒళ్ళుమండింది నాకు. చటుక్కున లేచి నిలబడి అతని దగ్గరకు వెళ్ళాను.

"లుక్ సింగ్వీ! మనమా కొండల్లోకి ఎందుకెళుతున్నామో ఏంచెయ్యబోతున్నామో, మీరసలెవరో చెపితేకాని నే నిక్కడనుండి కదలదలుచుకోలేదు" అన్నాను.

"ఎందుకు వెళుతున్నామో, ఏంచేస్తామో నువ్వే చూస్తావుగా. ఎందుకు తొందర?" అన్నాడు గపూర్ చిత్రంగా నవ్వుతూ.

# 8

రాత్రి ఎనిమిది గంటలు కావొస్తోంది. లాండ్ రోవర్ కొండదారంట పాములా ప్రాకుతూ ముందుకెళుతోంది. ఫ్రాంటియర్ పోలీసులకు అనుమానం కలగకుండా వుండేం

దుకు హెడ్ లైట్సు వేయకుండా చీకట్లో నడుపుతున్నాడు గఫూర్.

సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో బంగ్లా ఫ్రాంటియర్ పోలీసు స్థావరానికి మా ఉనికి గురించి తెలియజేశాము. బంగ్లా కమీషనర్ గుబా పర్మిషన్ లెటర్ చూసింతరువాత చెక్ పోస్టు అధికారి మేము ఆ ప్రాంతంలో తిరగడానికి ఏ మాత్రం అభ్యంతరం చెప్పలేదు. కాని, ఆ అడవుల్లో తిరిగే నాగా విప్లవకారుల్ని గురించి చాలా జాగ్రత్తగా ఉండాలని మాత్రం హెచ్చరించాడు. ఎటు ప్రక్కకు వెళ్ళినా ఫ్రాంటియర్ పోస్టులకు దరిదాపుల్లో ఉండమని చెప్పాడు.

అతనికి కృతజ్ఞతలు చెప్పి, ఈ ప్రాంతంలోనే ఉంటామని చెప్పి ముందుకు కదిలాము.

కొండలప్రక్కనేవున్న కాలిబాటలవెంట లాండ్ రోవర్ నడపడం చాలా కష్టమవుతోంది. ఆరుగంటల ప్రాంతంలో ఓ కొండవాగు దగ్గర కారాపి స్నానంచేసి, భోజనం పూర్తిచేసి, ఖాళీ అయిన వాటర్ కాంటీన్లనిండా నీళ్లు నింపుకొని మళ్ళీ ముందుకు బయలుదేరాం.

సరిహద్దు కొండల్ని దగ్గరగా చూస్తోంటే చాలా ఎత్తుగా, దట్టమైన చెట్లతోనిండి చాలా భయంకరంగా కనిపిస్తోన్నాయ్. ఇలా రాత్రిళ్ళు ప్రయాణం చెయ్యడం నాకే మాత్రం ఇష్టంలేదు. కాని సింగ్వీ, గఫూర్లు నా మాటవినే స్థితిలోలేరు. ఎందుకో తెలియని ఆత్రుత, టెన్షన్ వాళ్ళలో క్షణక్షణానికి తారాస్థాయికి వస్తున్నట్లు మాత్రం గమనించాను.

కాలిబాట కొండప్రక్కనుండి మళ్ళీ, కొండలకు దూరంగా వెనక్కి తిరిగింది. దూరంగా అన్నీ దట్టంగా

పెరిగిన తుప్పలు, పొదలు, గుబురుగా అడ్డదిడ్డంగా పెరిగిన చెట్లు కనిపిస్తున్నాయి. కారు తిప్పమన్నాడు సింగ్వీ.

కారు ఆపిన ప్రదేశం రెండు పెద్ద కొండల మధ్య లోయలా వుంది. రెండు కొండల మధ్యనుండి చూస్తే దూరంగా కొండలవెనుక మరో ఎత్తైన కొండ కనిపిస్తోంది. కొండలమీద దట్టంగా పెరిగిన అరణ్యంలోనుండి గుర్తుపట్టలేని జంతువులు, పక్షులు అరపులు అప్పుడప్పుడు వినిపిస్తున్నయ్.

"ఇక్కడనుండి కొండల లోపలికి వెళ్లాలి"_అన్నాడు సింగ్వీ డాష్‌బోర్డ్ దీపంకాంతిలో మేప్ ఓసారి పరిశీలనగా చూసి.

"వెహికల్ లోపలకు వెళ్ళదు"_అన్నాడు గఫూర్ దారి తెన్ను లేకుండా పెరిగిన చెట్లగుబుర్ల వంక చూస్తూ.

"అవును. ఇకనుండి నడిచివెళ్లాలి"_అన్నాడు సింగ్వీ కారు దిగుతూ.

సింగ్వీ, గఫూర్ ఇద్దరూ గబగబా బట్టలు మార్చుకోసాగారు.

"కమాన్ చక్రవర్తీ! చేంజ్ యువర్ డ్రెస్! ఈ ఫాన్సీ డ్రెస్‌లో కొండల్లోకి వెళ్ళడం కష్టం"_అన్నాడు సింగ్వీ.

నేను వేసుకొన్న సూటు తీసేసి, మందపు బట్టతో కుట్టిన జీన్సు, షర్టు వేసుకొన్నాను. తర్వాత వాళ్ళిద్దరూ కార్లోంచి మేం తీసుకెళ్లాల్సిన ఒక్కొక్క సామానే బయట పెట్టసాగారు.

రెండు పికాక్స్‌లు, షోవెల్, చేతిలో పట్టుకోవడానికి అనువుగావుండే గొడ్డలి ఒకటి, రెండుమూడు రోజులకు సరిపడే ఆహారపదార్థాలు, వాటర్ కాంటీన్లు, మూడు

ఫ్లాష్ లైట్లు అన్నీ బయటికితీసి తలకొకటి అందించాడు సింగ్వీ.

తర్వాత బానెట్ తెరచి స్పేర్ బాటరీ ఒకటి బయటకు తీశాడు. దాంతోపాటు ఉపయోగించడానికి, చిన్న వైర్ చుట్ట, బల్బు తీశాడు.

ఈలోగా గపూర్ కారుక్రిందకు దూరాడు. రెండు నిముషాలపాటు బోల్టులు వూడదీసి, మళ్ళీ బిగిస్తున్న శబ్దాలు వినిపించాయి. బయటికి వచ్చిన గపూర్ చేతిలో ఉన్న వస్తువులు చూసి ఆశ్చర్యపోయాను. చీకట్లోగూడా తేలిగ్గా గుర్తుపట్టవచ్చు వాటిని.

ఒక పిస్తోలును జేబ్లో దోపుకొని, రెండవది సింగ్వీకి ఇచ్చాడు. పిస్తోలేకాకుండా అతని చేతులో మరో ఆయుధం వుంది. లైట్ మిషిన్ గన్ అని గ్రహించాను. వీటన్నిటికి అమ్యునిషన్ ఎక్కడిది?

మరుక్షణం కోరినవన్నీ తెచ్చి ఇచ్చే మాంత్రికుళ్ళా గపూర్ నా సందేహం తీర్చాడు. అన్ ఎక్స్పోజ్ నెగటివ్ ఫిలిమ్ స్పూల్స్ వున్న గుండ్రటి టిన్స్ రెండు బయటికి తీశాడు గపూర్. జేబులోనుండి బాకు బయటికితీసి సీలు ఊడదీసి టిన్ తెరిచాడు. ఒక్కో టిన్ లో ముప్పైరౌండ్స్ వుండే అమ్యునిషన్ క్లిప్స్ నాలుగేసి వున్నాయి. వాటిని జాగ్రత్తగా టిన్స్ లోవున్న దూదిపొరల మధ్యనుండి తీసి ఫాంటుపౌచ్ పోకెట్స్లో పెట్టాను.

ప్రతీ విషయంలో వాళ్ళు తీసుకొన్న జాగ్రత్తలు చూస్తోంటే ఓ క్షణం వాళ్ళమీద కోపంపోయి ఓ విధమైన భయం కలగసాగింది.

తర్వాత సింగ్వీ అవసరమనుకొన్న మరికొన్ని వస్తువులు తీసి, అన్నిటినీ మూడు విడివిడి పాకెట్లుగా, వీపున కట్టుకుని మోసుకెళ్ళడానికి వీలుగా కట్టాడు.

ఏర్పాట్లన్నీ పూర్తయిన తర్వాత సింగ్వీ ఫ్లాష్‌లైట్ తీసుకొని జాగ్రత్తగా దారిచూసుకుంటూ చెట్లగుబుర్ల మధ్యకు వెళ్ళిపోయాడు.

"ఎంతదూరం వెళ్ళాలి ఈ కొండల్లోకి మనం?"— అన్నాను సిగరెట్‌ను నోట్లో పెట్టుకొని, లైటర్ వెలుగు బయటికి కనిపించకుండా రెండు అరిచేతుల మధ్య పెట్టి వెలిగిస్తూ.

"ఎక్కువదూరం కాదులే. భయపడక"—అన్నాడు గపూర్ తనూ ఓ సిగరెట్ వెలిగిస్తూ.

పావుగంట తర్వాత సింగ్వీ తిరిగి వచ్చాడు. గపూర్ సిగరెట్ క్రిందికి వంగి నేలమీద ఆర్పేసి, దానిపైన బూటు కాలితో కాస్త మట్టిపోశాడు. నేనూ అలానే చేశాను.

"కొంచెగా లోపలికి పెరిగిన జీడిచెట్లు ఉన్నాయి. లాండ్‌రోవర్‌ను దానికింద ఆపితే బయటికి కనిపించదు. చెట్లకు ఇవతలగా రెండు పెద్దకొండరాళ్లు అడ్డంగా ఉన్నాయి. పొరపాటున ఎవరన్నా ఇటువచ్చినా, ఆరాళ్ల చాటుకు వెళ్ళరు" అన్నాడు.

గపూర్ కారు స్టార్టుచేసి సింగ్వీ ముందునడుస్తూ దారి చూపిస్తుంటే చెట్లమధ్యకు పోనిచ్చాడు. రాళ్ళవెనక జీడి చెట్లమధ్యకు వెళ్ళడానికి సరిగ్గా కారు పట్టేంత సందు మాత్రమే వుంది. అదికూడా చిన్నచిన్న రాళ్ళతో కారు పోవడానికి వీలులేకుండావుంది. కారు ఏప్రక్కకు ఒరిగినా బండరాళ్ళకు గుద్దుకోవడం ఖాయం.

గపూర్ డ్రైవింగ్ నైపుణ్యానికి జోహారు చెయ్యాలని పించింది. ఆ రెండు కొండరాళ్ళమధ్యనుండి పాములా పోనిచ్చాడు లాండ్‌రోవర్‌ని.

జీడిచెట్ల గుబుర్లమధ్య కారు ఆపగానే సింగ్వీ ఒక వల లాంటిది తీసి లాండ్‌రోవర్‌మీద కప్పాడు. తర్వాత

గొడ్డలితో చిన్న చిన్న కొమ్మలు, గుబుర్లు నరికి వాటిని వల మీద పరిచాడు. ప్రక్కనుండి చూస్తుంటే వలక్రింద లాండ్ రోవర్ కనిపించడంలేదు. అక్కడో పెద్ద పొదవున్నట్లుంది. పగలయినా, ఎవరైనా దగ్గరకువచ్చి పరీక్షగా చూసేవరకూ అక్కడో కారువున్నట్లు అనిపించదు.

'కామాఫ్లాగ్' — అంటారు ఇలా వస్తువుల్ని ప్రకృతిలో కలిసిపోయేలా దాచడాన్ని. అప్పుడనిపించింది నాకు, బహుశా సింగ్వీ ఆర్మీలో పనిచేసి ఉండాలని.

టైమ్ తొమ్మిది కావొస్తోంది. ముగ్గురం చకచకా లోయలోనుండి దూరాన కనిపిస్తున్న అవతలి కొండవైపు బయలుదేరాం.

ముందు సింగ్వీ, మధ్యలో నేను, వెనక గఫూర్ ఈ వరసలో నడుస్తున్నాము. దట్టంగా పెరిగిన చెట్ల మధ్య నుండి, పొదల్లోనుండి, రాళ్ళమీద, కొండగొర్రెలా చక చకా ముందుకు వెళ్ళిపోతున్నాడు. నాగరికతమధ్య, కార్లలో తిరిగే నాకు అతనితోపాటు వేగంగా నడవాలంటే చాలా కష్టంగావుంది.

లోయ అవతలి కొండ చూడ్డానికి దగ్గరగా అనిపించినా నడిచేకొలదీ దూరం పెరుగుతూనే ఉన్నట్లనిపించింది. దాదాపు తెల్లవారుజాము మూడుగంటల ప్రాంతంలో అవతల కొండదగ్గరికి చేరుకొన్నాము.

## 9

ముగ్గురం మెల్లి మెల్లిగా కొండ ఎక్కడం ప్రారంభించాము.

కొండంతా ఒకదానిమీద ఒకటి పేర్చినట్లున్న రాళ్ళతోనూ, చీపురు దుబ్బులతోనూ, పెద్ద పెద్ద చెట్లతోనూ

నిండివుంది. త్వరత్వరగా ఎక్కడానికి వీలులేదు. మొదట ఓ వంద అడుగుల ఎత్తువరకూ పెద్దబాధ లేకపోయినా, తర్వాత మాత్రం కాళ్ళు, పిక్కలు విపరీతమైన నొప్పులు వేయసాగాయి. పైగా వీపుమీద బరువు.

అలా ఆరేడు వందల అడుగులు వెళ్ళింతరువాత కొండ ఏటవాలుతనం తగ్గి కాస్త సమతలంగా ఉందనిపించింది. అలా కొంతదూరం ఎక్కింతరువాత హఠాత్తుగా చిన్న కారు వెళ్ళేంత వెడల్పు రోడ్ కనిపించింది. పైకి చూడ్డానికి రోడ్‌లా కనిపించడంలేదది. చాలా పాతది అయ్యుండాలి. ఎవ్వరూ వాడక రోడ్ నిండా గడ్డిపొదలు, చిన్న చిన్న చెట్లు మొలిచాయి.

ఆ కొండ రోడ్ మీదకు రాగానే బ్రేక్ ఫాస్ట్ చేసి విశ్రాంతి తీసుకుందామన్నాడు సింగ్వీ.

"ఈ రోడ్ క్రిందినుండీ వుందా?"—అడిగాను వీపు మీద పాక్ దించి, అడ్డదిడ్డంగా మొలిచిన గడ్డిమీద కూలబడుతూ.

"ఆ! ఇదివరకు ఉండేది. బ్రిటిష్‌వాళ్ళ కాలంలో అగర్తలానుండి ఈ రోడ్ కొండపైకి ఉండేది. ఈ దారంట పైకి వెళితే మరోవంద అడుగులపైన రాగి గనులున్నాయి. ఖనిజం అయిపోవడం వలన ఓ యాభై సంవత్సరాల క్రితమే ఆ గనులు మూసేశారు. అప్పటి రోడ్డిది. చాలాకాలం వాడకంలో లేకపోవడం వలన, రిపేరు లేకపోవడం వలన క్రిందభాగమంతా దాదాపు కొట్టుకుపోయింది వర్షాకాలంలో. ఇండియా, తూర్పు పాకిస్తానుగా ఈ ప్రాంతం విడదీసింతరువాత ఈ కొండలు తూ. పాకిస్తాన్‌లోకి, అగర్తలా ఇండియాలోకి వెళ్ళిపోయాయి. చాలామందికి ఈ రోడ్ ఒకటున్న సంగతి తెలియదు"—అన్నాడు సింగ్వీ పాక్ విప్పుతూ.

"అంటే క్రిందనుండి జీప్‌లో పైకి రావడానికి కుదరదా?" అడిగాను.

"ఊహుం! వీలులేదు. అప్పుడైనా పనివాళ్లు పైకి, క్రిందకు రావడానికి మాత్రమే ఈ రోడ్ ఉపయోగించేవాళ్ళట. త్రవ్విన ఖనిజాన్ని కేబుల్ వాగన్లద్వారా కొండక్రిందికి పంపిస్తే, ట్రక్కులు అక్కడినుండి అగర్తలాలోవున్న రిఫైనరీకి తీసుకెళ్ళేవి"—

అర్థమయినట్లు తలవూపాను.

తర్వాత బ్రెడ్, బటర్, టిన్డ్ చాక్లెట్ మిల్క్, టిన్డ్ ఫ్రూట్‌తో త్వరత్వరగా బ్రేక్‌ఫాస్టు ముగించాము. సింగ్వీ, కపూర్‌లు చాలా అసహనంగా ఉన్నట్లు వాళ్ళు బ్రేక్‌ఫాస్టు చేసిన పద్ధతి చూస్తుంటే తెలుస్తోంది. స్టౌమీద వేడిచేసిన చాకొలెట్ మిల్క్ మాత్రం పూర్తిగా త్రాగారు.

బ్రేక్‌ఫాస్టు పూర్తిచేసి సిగరెట్లు వెలిగించాక మళ్ళీ నడక సాగించాము.

ఓ గంట నడిచేప్పటికి కొండపైభాగం చాలావరకు సమతలంగా కనిపించసాగింది. రోడ్ ప్రక్కగా శిథిలమైన చిన్నచిన్న ఇళ్ళు రెండు కనిపించాయి. బహుశా గనులు పనిచేస్తున్నప్పుడు వాటిని ఉపయోగించేవాళ్ళనుకొంటాను. చెట్లుకూడా దట్టంగా పెరిగి వున్నాయి.

హఠాత్తుగా మేము నడుస్తున్న రోడ్ కుడిచేతివైపు మలుపు తిరిగింది. మలుపు అవతల స్పష్టంగా పచ్చని రంగులోవున్న సొరంగాలు కనిపిస్తున్నయ్. గనులుమూసేసి యాభై సంవత్సరాలకు పైబడ్డంవలన, త్రవ్విన సొరంగాల ముందు, ప్రక్కల అన్నీ దట్టమైన చెట్లతో, పొదలతో, అడవి తీగలతో కనిపించీ కనుపించకుండా ఉన్నాయి.

సింగ్వీ ఆగలేదు. నడక వేగం హెచ్చించి ఇంకా

ముందుకు వెళ్ళసాగాడు. నేను వెనకనే నడుస్తూ ఒక్కొక్క సారంగాన్నే లెక్క పెడుతున్నాను. దాదాపు ఎనిమిది దాటాము. హఠాత్తుగా సింగ్వీ దట్టంగా కనిపిస్తున్న ఓ చెట్లగుబురుముందు ఆగాడు.

నేను కళ్ళు చిట్లించుకొని జాగ్రత్తగా చూశాను. అన్నీ గుబురుగా పెరిగిన చెట్లు, అడవితీగలు తప్ప సారంగం లాంటి దేదీ కనిపించడంలేదు. అప్పటికి సూర్యోదయమైనా సూర్యుడు కొండ అవతలివైపు ఉండడంతో చెట్ల గుబుర్ల వెనక చీకటిగానే వుంది.

"హియర్ ఇటీజ్!" అన్నాడు సింగ్వీ మంత్రించబడిన మనిషల్లే ఆ గుబుర్ల వైపు చూస్తూ.

"అవును ఇదే"—అన్నాడు గపూర్ కూడా శిలావిగ్రహంలా నిలబడి అటుచూస్తూ.

కాసేపు ఇద్దరూ అలానే నిలబడిపోయారు. ఓ నిముషం తరువాత సింగ్వీ ఏదో గుర్తొచ్చినవాడికిమల్లే తల విదిలించి ముందుకు నడిచాడు. చేతిలోవున్న గొడ్డలితో అడ్డంగావున్న చెట్లకొమ్మల్ని, అడవితీగల్ని నరుకుతూ చెట్లమధ్యకు నడిచాడు.

చెట్లమధ్యకు నాలుగైదు గజాలు నడిచాక, హఠాత్తుగా కొద్దిపాటి ఖాళీప్రదేశం కనిపించింది. దాని అవతల అడ్డదిడ్డంగా పడివున్న పచ్చని కొండరాళ్ళ గుట్ట కనిపిస్తోంది. వాటివెనక ఓ రాగిగని ముఖద్వారం వుందని ఎవరైనా గ్రహించగలరు.

ముగ్గురం వీపుమీద బరువులు దించి, షావెల్స్, పికాక్స్‌లు బయటికి తీశాం. గపూర్ లైట్‌మెషిన్‌గన్‌ను ఓ కొండ రాతికి ఆనించి పెట్టాడు. దాన్ని చేజిక్కించుకుని వీళ్ళను కాల్చిపారేస్తే బావుండుననిపించింది ఓ క్షణం.

"ఇప్పుడు ఆ గనికి అడ్డంగావున్న రాళ్ళుతీసి మనిషి

లోపలకు వెళ్ళేంత సందు తయారు చెయ్యాలి" అన్నాడు సింగ్వి.

గనిముఖద్వారం ముందు రాళ్ళు, ఇష్టంవచ్చినట్లు పడి వున్నాయి. బహుశ గనిముఖద్వారాన్ని ఏ డైనమెట్ తోనో పేల్చి మూసివేసి వుండాలి. ఒక రాయిని బయటకు లాగితే పదిరాళ్ళు కదిలి వచ్చేట్టున్నాయి.

గఫూర్, సింగ్విలు ఒకప్రక్కనుండి మెల్లిగా పిక్ యాక్స్ లతో ఒక్కొక్క రాయి లాగడం మొదలు పెట్టారు. సింగ్వి ప్రక్కకు లాగగానే 'బుస్' మన్న శబ్దం వినిపించింది.

నేను ఉలిక్కిపడి చూశాను. తాచుపామొకటి బండ మీద పడగవిప్పి ఆడుతోంది. సింగ్వి సందేహించలేదు. పికాక్స్ ను అడ్డంగా తిప్పి దాని తలమీద మోదాడు.

పడగమీద బుసకొడుతోన్న పామును చంపడం చాలా కష్టం. కాని సింగ్వి నిపుణత్వాన్ని మనసులోనే అభినందించకుండా వుండలేకపోయాను. చివరి క్షణంలో పాము పడగ వెనక్కి వంచడంలో పికాక్స్ దెబ్బ పడగకు ఓ అడుగుక్రింద తగలడంతో ఆ భాగమంతా నజ్జునజ్జయింది.

నేను ఊపిరిబిగబట్టి, కళ్ళప్పగించి అటే చూస్తున్నాను. ఒక్కక్షణం పాముపడగ వెనక్కి ముందుకి ఊగింది. ఆ విరిగిన శరీరంతోనే మళ్ళీ పడగ విసిరింది. ఈసారి సింగ్వి గురి తప్పలేదు. పడగ విసిరిన సమయంలోనే మెరపులా దాని తలమీద మోదాడు. పాము మళ్ళీ పైకి లేవలేదు. తల పచ్చడయింది.

"ఇటీజ్ ఫినిష్డ్!" అన్నాడు సింగ్వి దాన్నే చూస్తూ.

ఇంకా ఎక్కడో కాస్త ప్రాణం వున్నట్లు తోక అటూ ఇటూ కొట్టుకొంటోంది. చుట్టగావున్న పాము శరీరాన్ని పికాక్స్ మొనతో బయటికి లాగాడు. దాదాపు

పది అడుగుల పైనవుంది చాలా లావుగా.

"కింగ్ కోబ్రా" అన్నాడు గఫూర్ పరీక్షగా చూసి.

"డి హెల్ విత్ ఇట్. త్వరగా పని పూర్తిచెయ్యాలి" అని నావైపు తిరిగి, "నీవూ చెయ్యివేస్తే త్వరగా అవుతుంది" అన్నాడు.

నేనూ తప్పనిసరిగా షోవెల్ తీసుకొని బయటకులాగిన మట్టిని, రాళ్ళను ఓ ప్రక్కకు వెయ్యసాగాను. దాదాపు రెండు గంటలు కష్టపడింతరువాత మనిషి లోపలకు వెళ్ళ గలిగినంత కన్నం ఏర్పరిచాము. ప్యాక్‌లోనుండి ఫ్లాష్ లైట్ తీసి లోపలకు ఫోకస్ చేశాడు సింగ్వీ. నేను వాళ్ళిద్దరి మధ్యనుండీ లోపలకు తొంగిచూశాను. అంతా చీకటిగా వుంది. ఏమీ కనిపించడంలేదు.

సింగ్వీ పికాక్స్, లైట్ తీసుకొని రంధ్రంలోనుండి లోపలకి వెళ్ళాడు. లోపలినుండి రెండు పెద్ద బండలు బయటివైపుకు నెట్టడంతో రాళ్ళన్నీ కదిలి తిన్నగా లోపలికి నడిచి వెళ్ళడానికి దారిఏర్పడింది. ఎక్సయిట్‌మెంట్‌లో చీకట్లో వుపయోగించడానికి స్పేర్ బ్యాటరీ, బల్బువున్న సంగతి మరచిపోయాము.

గఫూర్ నన్ను తోసుకొని లోపలకు నడిచాడు. అతని వెనకే నేనూ ఫ్లాష్ లైటు వెలిగించి లోపలకు వెళ్ళాను. మా ముగ్గురి లైట్లకాంతిలో గని వెనక భాగమంతా స్పష్టంగా కనిపించసాగింది. సగం త్రవ్వి వదిలేసిన కొండ గుహలా వుందది. బహుశా ఖనిజం ఎక్కువ లేకపోవడం వలన త్రవ్వకుండా వదిలేసి వుంటారు.

# 10

గుహలోపల పెద్దపెద్ద పెట్టెలు పేర్చివున్నాయి. ప్రతి పెట్టె మూతలపైన సీళ్ళువేసి కనిపిస్తున్నాయి. సింగ్వీ

గఫూర్ ముందుకెళ్ళి ఒక్కొక్క పెట్టె దించసాగారు.

"ఏముంది ఆ పెట్టెల్లో?" అన్నాను క్యూరియాసిటీ ఆగక.

సింగ్వీ నా వైపు చూసి నవ్వి పికాక్స్‌తో ఓ పెట్టె తాళం పగలగొట్టి మూత తీశాడు.

ఫ్లాష్ లైట్ కాంతిలో నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను. ఆ పెట్టెనిండా ఒక్కొక్కటీ అడుగుపొడవున్న బంగారం దిమ్మలున్నాయి.

"మై గాడ్ గోల్డ్!" అన్నాను ఆశ్చర్యం పట్టలేక.

"కావాలా చక్రవర్తి? ఆ పెట్టె నీదే తీసేసుకో" అన్నాడు సింగ్వీ నవ్వుతూ.

వాళ్ళింకా ఒకదానిమీద ఒకటి పేర్చిన పెట్టెలన్నీ దించుతూనే వున్నారు. నా కళ్ళు ఆ పెట్టెలోని బంగారం మీద నుండి తిరగడంలేదు. ఒక ఇటుక తీసి ఫ్లాష్ లైటు కాంతిలో పరీక్ష చేశాను. "రిజర్వ్ బాంక్ ఆఫ్ పాకిస్థాన్" అన్న అక్షరాలు వాటిమీద ముద్రించి వున్నాయి. అసలు సిసలైన బంగారం. ఒక్కొక్క ఇటుక బరువు నాలుగు కిలోలకు తక్కువుండదు. ఆ లెక్కన ఆ పెట్టెలన్నిటిలో బంగారం తూకంవేస్తే నాలుగైదు టన్నులుంటుంది.

పికాక్స్‌తో క్రిందకు దించిన ప్రతీ పెట్టెతాళం పగలగొట్టి మూతలు తెరచి చూడసాగాను. నా చర్యకు సింగ్వీ ఏం అభ్యంతరం పెట్టలేదు. సింగ్వీ తెరచిన పెట్టెకాకుండా మరొక పెట్టెలోనే బంగారం వుంది. మిగిలిన పెట్టెల్లో కరెన్సీ నోట్లకట్టలు కనిపిస్తోన్నయ్. కొన్ని అమెరికన్ డాలర్లు, జర్మన్ మార్కులు, బ్రిటిష్ పౌండ్లు, ఇరానియన్ దినార్లు, ఇండియన్ రూపాయలు, రకరకాల దేశాల కరెన్సీ నోట్లు. ఎక్కువగా పాకిస్థాన్ కరెన్సీ వున్నాయి.

చివరికి అడుగు వరసలోనుండి ఓ పెట్టె బయటకి

లాగారు ఇద్దరూ. మామూలు పెట్టెలకన్నా చాలా చిన్నగా వుంది ఆ పెట్టె. చాలా గట్టిదనిపిస్తోంది చూపులకే. వాళ్ళిద్దరూ పికాక్స్‌లతో కాసేపు దాడిచేసింతరువాత గాని దాని తాళం వూడిరాలేదు. పెట్టె మూత తెరచి ఫ్లాష్ లైటు పెట్టెలోపలకు ఫోకస్ చేశాడు సింగ్వీ.

మరుక్షణం చీకటి గనంతా చిత్రవిచిత్రమైన కాంతులతో నిండిపోయింది. పెట్టెలో వెల్వెట్ కుషన్లమధ్య వున్న నాలుగు డైమండ్స్ కళ్ళు మిరుమిట్లు గొలిపేలా మెరుస్తోన్నాయ్. ముగ్గురం ఊపిరి బిగబట్టి వాటివంకే చూస్తూ వుండిపోయాం ఓ క్షణం.

అంతే! సింగ్వీ, గఫ్రూర్ లిద్దరూ చెరో రెండు వజ్రాలూ చేత్తో పట్టుకొని చిన్నపిల్లాళ్ళలా గంతులు వేయసాగారు. వాళ్ళ పిచ్చిఆనందం చూస్తే వాళ్ళతోపాటు నాకూ గంతులు వేయాలనిపించింది.

వాళ్ళిద్దరూ ఒకర్నొకరు కావిలించుకొని, ఆనందంగా ఒకరివీపు మరొకరు చరుచుకోసాగారు. నేను వాళ్ళిద్దరి వంకా కళ్ళార్పకుండా చూస్తూ వుండిపోయాను.

“ఢాం!” మని తుపాకి పేలిన ధ్వని గుహలో ప్రతి ధ్వనించింది.

ఒక్క క్షణం గుహలో కలకలం ఆగిపోయి, చలనం లేకుండా వుండిపోయాము.

చలనంలేని శిలాప్రతిమల్లా నిలబడిపోయాము ఒక్క నిముషంపాటు.

ఏంజరుగుతోందీ అర్థంకావడానికి ఒక్క క్షణం ఆలోచించాల్సి వచ్చింది. మా వెనక గుహలోకి చాలామంది వచ్చి నిలబడినట్లు శబ్దంబట్టి తెలుస్తోంది.

“దయచేసి వెనక్కు తిరగండి. అకస్మాత్తు కదలికలు చెయ్యొద్దు” అదే స్వరం తిరిగి ఇంగ్లీషులో చెప్పింది.

మెల్లిగా వెనక్కి తిరిగాము. వెనక్కి తిరుగుతోంటే మా చుట్టూతా ముదురాకు పచ్చ యూనిఫాంలో వున్న సాయుధులైన మనుషులు కనిపించారు. ఒక్కక్షణం వాళ్ళు భారత సైనికులేమోనని వాళ్ళ యూనిఫాం చూసి పొరబడ్డాను.

మాకు హెచ్చరిక ఇచ్చిన వ్యక్తి పొడుగ్గా, సన్నగా వున్నాడు. గడ్డం నున్నగా, గుహ ముఖద్వారంనుండి వస్తోన్న వెలుగులో మెరుస్తోంది. అతని బెల్టుకు పిస్తోలు పెట్టుకొనే తోలు కేసు వ్రేలాడుతోంది. వెలుతురు అతని వెనకవైపు పడడంవలన అతని ముఖకవళికలు స్పష్టంగా చూడ్డానికి కనిపించడంలేదు.. చేతిలో పిస్తోలు మావైపు గురిపెట్టివుంది.

"మీ దగ్గరవున్న ఆయుధాలు ఒక్కొక్కటీ తీసి క్రింద పారేయండి" అన్నాడతను.

సింగ్వీ, గఫూర్ లు బెల్టుల్లో పెట్టుకొన్న పిస్తోళ్ళుతీసి అతని కాళ్ళదగ్గర పడేలా విసిరేశారు.

అతను నావైపు చూశాడు. నేను నా దగ్గర ఏమీ లేవని తలవూపాను. మా చుట్టూ అతని మనుషులు రైఫుల్స్, స్టెన్ గన్ లు మావైపు గురిచేసి నిలబడివున్నారు. ఏ పొరపాటు చేసినా మా శరీరాలనిండా బుల్లెట్లు నిండి తీరతాయి.

సింగ్వీ, వాళ్ళ నాయకుడ్ని అప్పటివరకూ తీక్షణంగా చూస్తూ వుండిపోయాడు. బహుశా అతని శక్తియుక్తుల్ని అంచానా కట్టడానికి ప్రయత్నిస్తున్నాడనుకొంటాను. గఫూర్ మాత్రం క్రోధంతోనూ, నిస్సహాయతవలన కుత కుతలాడుతున్నట్లు కందగడ్డలా ఎర్రబడిన అతని ముఖమే చెపుతోంది.

"ఎవరు మీరంతా?" అన్నాడు సింగ్వీ ఇంగ్లీషులోనే

అతనివైపు చూస్తూ.

సింగ్వి గొంతులో అదురూ లేదు. కోపంగాని, ఏ రకమైన ఎమోషన్ కనిపించడంలేదు. జరిగిన విషయానికి ఏమాత్రం తత్తరపడినట్లు కనిపించడంలేదు.

అతను సింగ్వి ప్రశ్నకు పెద్దగా నవ్వాడు. "సారీ! పరిచయం చేసుకోనందుకు. అయామ్ మేజర్ మైకెల్ కాస్ట్రో ఆఫ్ ది రిబెల్ ఆర్మీ ఆఫ్ నాగాలాండ్. మీ రెవరో తెలుసుకోవచ్చునా?" అతని మృదువైన మాటల వెనుక ఉక్కు తీగలాంటి కఠినత్వం వుంది.

అప్పటికి తట్టింది నాకు వీళ్ళెవరో! ఈ కొండల్లో చిక్కకొని సరిహద్దు పోలీసులకు తలనొప్పిగా తయారైన విప్లవ నాగాలు వీళ్ళనన్నమాట.

"మేజర్ కాస్ట్రో- మైఫుట్!" అన్నాడు గఫూర్ కోపంగా.

సింగ్వి వారిస్తున్నట్లుగ గఫూర్ వైపు ఓసారిచూసి చిన్నగా నవ్వాడు. "గ్లాడ్ టు మీట్ యు మేజర్ కాస్ట్రో! మమ్మల్ని ఇలా ఆయుధాల్తో బెదిరించడంలో నీ ఉద్దేశ్య మేమిటి?"

కాస్ట్రో ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేదు. తన అనుచరులకు సైగచేశాడు. ముగ్గురు నాగాలు మా వెనగ్గా వచ్చి మా ముగ్గురి జేబులు వెతికి, అమ్యునిషన్ కిప్పులు, కత్తులు తీసేసుకొని ఓ తాడుతో బిగుతుగా మా ముగ్గురి చేతులు కలిపి కట్టేశారు. స్టెన్‌గన్ పట్టుకొన్న నాగా ఒకడు మాకు కాపలాగా నిలబడ్డాడు.

మైకెల్ కాస్ట్రో క్రిందికివంగి నాలుగు వజ్రాలను ఏరి తీసుకొని ఒక్కక్షణం వాటిని పరిశీలించాడు. తళతళ మెరిసిపోతున్న వాటి విలువ అంచానా కట్టడం చాలా కష్టం. వాటికోసం, ప్రిన్స్ ఖాట్హామ్‌ను చంపడానికి,

బేబీని హింసపెట్టడానికి వెనుదీయలేదు సింగ్వీ, గఫూర్‌లు. అసలిక్కడ ఇంత బంగారం, కరెన్సీ, విలువైన వజ్రాలు వున్నట్లు వీళ్ళకెలా తెలుసో?

గనిలోవున్న ధనరాశినిపరీక్షగా చూసేప్పటికి మైకెల్ కాస్ట్రోకు ఒక్కనిముషం కళ్ళు తిరిగుండాలి. కాని అతని ఆజ్ఞలేనిదే ఏమీ ముట్టుకోని అతని అనుచరుల్ని చూస్తే వాళ్ళ క్రమశిక్షణ అర్థమవుతోంది.

ఆ నాలుగు వజ్రాలను అరిచేతిమీద పెట్టుకొని మాకు దగ్గరగా వచ్చాడు మేజర్ కాస్ట్రో. "ఇదన్నమాట విషయం! ఉదయమే కొండలమీద ప్రయాసపడి ఎక్కుతోన్న మిమ్మల్ని చూసి ఏ జంతువుల్నో వేటాడ్డానికి వచ్చారనుకొన్నానుగాని, ట్రెజర్ హాంటర్స్ అని ఊహించలేకపోయాను. వెల్! వీటి విలువెంత?" అన్నాడు కాస్ట్రో మా ముఖాలముందు తన అరచేతిని పెట్టి.

చిన్నసైజు నిమ్మకాయలసైజులో వున్నాయి ఆ నాలుగు డైమండ్స్. నీలాకాశం రంగులో ధగధగ మెరుస్తున్నాయి. బ్లూ డైమండ్స్ చాలా విలువగలవి అంటారు.

సింగ్వీ, గఫూర్ మాట్లాడలేదు. కళ్ళప్పగించి ఆ డైమండ్స్‌నే చూస్తూ వుండిపోయారు.

## 11

విప్లవనాగాలు మమ్మల్ని బంధించిన తరువాత కొండల మధ్యలో ఎక్కడోవున్న వాళ్ళ స్థావరానికి మమ్మల్ని తీసుకెళతారని అనుకొన్నాను. కాని వాళ్ళ స్థావరం బంగ్లాదేశ్‌లోనే ఓ సరిహద్దు గ్రామంలో వున్నట్లు కళ్ళతో చూసేప్పటికి ఆశ్చర్యపోయాను.

గ్రామం అనడానికి వీల్లేదు దాన్ని. 'బవేరా' అనే కొండజాతి గూడెం ఇది. నాగాలు, మిజోలలానే వీళ్ళు

అస్సాం, త్రిపుర, మణిపూర్ రాష్ట్రాలలో మైనారిటీ జాతులు. 1947 లో దేశ విభజన జరిగినప్పుడు ఈ గూడెం ప్రస్తుత బంగ్లాదేశ్ భూభాగంలోకి వచ్చింది.

బంగ్లా, పాక్ ప్రభుత్వం చేతుల్లో ఉన్నప్పుడు నాగాలకు సహాయం చెయ్యడంలో, ఆశ్రయం ఇవ్వడంలో బహిరంగంగా ఉండేవాళ్ళు ఈ గూడెం ప్రజలు. బంగ్లాదేశ్ ఏర్పడింతరువాత బహిరంగంగా ఈ సహాయం తగ్గిపోయింది. అయినా కొండల్లోవున్న విప్లవ నాగాలకు, రహస్య సమాచారం, ఆహారం, వస్త్రాలు దాదాపు ఈ గ్రామం ద్వారానే అందుతున్నాయని సింగ్వీ చెప్పాడు.

గూడెం మొత్తంలో అరవై, డెబ్బై గుడిసెలు ఉంటాయి. గూడెం నాయకుడికి మాత్రం అడవి దుంగలతో, చెక్కలతో కట్టిన ఇల్లువుంది. కొండలచుట్టువున్న అడివికి ఆనుకొని వుంది గూడెం. చెట్లమధ్యలోనుండి చేతులు విరిచి కట్టబడిన మమ్మల్ని తీసుకొస్తోంటే మగవాళ్లు, ఆడాళ్ళు, పిల్లలు విచిత్రంగా మాకేసి చూడసాగారు. బంగారం, కరెన్సీవున్న పెట్టెను మాతో తీసుకురాలేదు. బహుశా, వాటిని కొండల్లోనే మరెక్కడో దాచివుంటారు.

ఆ నాలుగు డైమండ్స్‌ను మాత్రం మేజర్ కాస్ట్రో, గుడ్డలుచుట్టి పైజేబులో పెట్టుకున్నాడు.

"మనల్ని ఇప్పుడేం చేస్తారు వీళ్లు?" అడిగాను నేను సింగ్వీని బెంగాలీలో.

"బహుశా కాల్చి చంపేస్తారనుకొంటాను. ముందు మన మెవరమో ప్రశ్నించి, వివరాలు తెలుసుకుని వాళ్లకు పనికొచ్చేట్లు వుంటే వుంచుతారు. లేకపోతే కాల్చి చంపేస్తారు."

"అంటే?"—

"మనం భారత ప్రభుత్వానికిగాని, బంగ్లా ప్రభుత్వానికిగాని చెందిన ముఖ్యమైన మనుషులనుకొంటే, ఆ రెండు ప్రభుత్వాల దగ్గర నిర్బంధంలోవున్న వాళ్ళ నాయకులతో బేరం పెడతారు"—

ఒక్కసారి గుండె ఝల్లుమంది నాకు. భారతదేశానికిగాని, ప్రభుత్వానికిగాని ఏరకంగానైనా పనికొచ్చే మనిషినా నేను?

"అలా బేరం పెడితే వీళ్లను వచ్చి పట్టుకోరూ?"— అన్నాను చిన్నపిల్లాడిలా.

"ఊహుc. వాళ్ల పద్ధతులు వాళ్లకుంటాయి"—

మా ముగ్గుర్నీ దుంగలతో కట్టిన నాయకుడి ఇంట్లోకి తీసుకెళ్ళారు. మధ్యగది విశాలంగా, గదంతా ఆ మూల నుండి ఈ మూలకు రంగురంగుల ఈనెలతో అల్లిన చాప వుంది. కూడెం నాయకుడికి, శాస్త్రికి కాసేపు మాకు తెలియని భాషలో సంభాషణ జరిగింది. శాస్త్రి తన అనుచరుడు ఒకడికి సైగ చేశాడు.

ఒక మూల చాపను ప్రక్కకి తొలగించారు. వంగి నేలమీదవున్న ఓ చెక్క తలుపు తెరిచాడు వాడు. భూగృహం అన్నమాట. కొవ్వొత్తి ఒకటి వెలిగించి నాగా ఒక్కడు ముందుకి దిగాడు. తర్వాత మేం ముగ్గురం ఒకొక్కళ్ళమే చెక్క మెట్లమ్మట క్రిందికి దిగాము.

క్రిందికి దిగింతరువాతగాని భూగృహం సైజు అర్థం కాలేదు మాకు. పయిన ఎంత ఇల్లువుందో దాదాపు అంత భూగృహంవుంది. గోడలు సిమ్మెంటు చేసివున్నా, నేలంతా చెమ్మగావుంది. చివరగావున్న ఓ పెద్దగదిలోకి తోశారు మా ముగ్గుర్ని. మేము లోపలకు వెళ్ళగానే మా వెనకే తలుపుమూసి తాళం వేసేశారు.

గదంతా చాలా చీకటిగావుంది. గాలి లోపలకు ఎలా వస్తుందో అర్థంకావడంలేదు. లోపలంతా గుర్తు తెలియని దుర్వాసన వస్తూంది. గోడలు, నేల చెమ్మగా, తడితడిగా వున్నా విపరీతంగా చెమటపోస్తూంది. క్లిక్‌మన్న శబ్దం వెంటనే చిన్న వెలుగు గదిలో కనిపించాయి.

గఫూర్ చేతిలో సిగరెట్ లైటర్ వెలుగుతోంది. "థాంక్ గాడ్! ఈ సిగరెట్లు, లయిటరు మిగిల్చారు బాస్టర్డ్స్"—అన్నాడు రిలీఫ్‌గా.

* * *

బంగ్లా స్వాతంత్ర్య పోరాటం ముమ్మరంగా జరుగుతున్న రోజులవి. ముక్తివాహిని గెరిల్లా కార్యకలాపాలు పాక్ సైనికులకు, పాలకులకు విపరీత నష్టాన్ని కలుగజేస్తున్నవి. ప్రతీ బెంగాలీ కులమత భేదం లేకుండా ముక్తివాహిని గెరిల్లాలకు అన్నిరకాలయిన సహకారం అందజేస్తున్నాడు.

తమ మాట వినక తిరుగుబాటు చేస్తున్న ప్రజల్ని అణచడానికి జనరల్ టిక్కా-ఖానుని తూర్పుపాకిస్తాన్ మిలటరీ గవర్నర్‌గా నియమించాడు ప్రెసిడెంట్ యాహ్యాఖాన్. జనరల్ టిక్కా-ఖాన్ నాయకత్వంలో విప్లవాన్ని అణచడానికి పాక్ సైన్యం చెయ్యని ప్రయత్నంలేదు.

యుద్ధం మొదలవుతోంది అని తెలియగానే పాక్ పాలకులు జాగ్రత్తపడడం ప్రారంభించారు. తూర్పు పాకిస్తాన్‌లోవున్న ముఖ్యమైన ప్రభుత్వ పత్రాలు, రికార్డులు వెంటనే పశ్చిమ పాకిస్తాన్‌కు తరలించారు. వాటితోపాటు బంగ్లా ప్రజలనుండి దోచుకున్న బంగారం, విలువైన వస్తువులు, ఆభరణాలు కూడా పంపబడ్డాయి.

ఢాకాలోవున్న పాకిస్తాన్ రిజర్వ్ బాంక్ బ్రాంచ్ కూడా ఖాళీ చెయ్యబడింది. రిజర్వ్ బాంక్‌లోవున్న బంగారం, కరెన్సీనోట్లు, ఇతర విలువైన వస్తువులు,

షినప్పెట్టెలలో పెట్టి సీల్ చేసి విమానాశ్రయానికి తరలించ డానికి ఓ మిలటరీ ట్రక్కులో సర్దేశారు. మరో గంటలో విమానం పాకిస్తాన్‌కు ఎగిరిపోతుంది.

కాని; సంఘటనలు పాక్ అధికారులు ఊహించినట్లు జరగలేదు. భారత సేనలు సరిహద్దులు దాటి తూర్పు పాకిస్తాన్‌లోకి చొచ్చుకురాసాగాయి.

భారత వైమానికదళం, బాంబులతోనూ, రాకెట్లతోనూ ఆ తెల్లవారుజామున చేసిన మెరుపుదాడిలో ఢాకా విమానాశ్రయం, మిలటరీ విమానాశ్రయం, అక్కడ యుద్ధానికి సిద్ధంగావున్న నాలుగు స్క్వాడ్రన్ల శాబర్ జెట్ విమానాలు పూర్తిగా నిముషాల్లో ధ్వంసమైనాయి.

యుద్ధం ప్రారంభమయిన ఇరవై నాలుగ్గంటలలోనే తూర్పు పాకిస్తాన్ గగనతలంలో భారత విమానాలు వీరవిహారం చెయ్యసాగాయి.

ఇక పాక్ అధికారులకు మిగిలిన అవకాశం ఒక్కటే. సముద్రమార్గం. పాక్ జలాంతర్గామి ఒకటి చిట్టగాంగ్ రేవులో వున్నట్లు తెలిసింది పాక్ అధికారులకు. భారత విమానాలు కమ్యూనికేషన్ లైన్లు అన్నీ ధ్వంసంచేయడం వలన చిట్టగాంగ్ రేవును కాంటాక్ట్ చేయడం కష్టమయింది. ఈ రిజర్వ్ బాంక్ నిధిని ఆ సబ్‌మెరైన్‌కు చేర్చగలిగితే దేశంలోనుండి దాటించవచ్చనే ఆలోచన కలిగింది పాక్ అధికారులకు.

ఢాకానుండి మర్నాటిలోపు ఆ ట్రక్‌ను చిట్టగాంగ్ రేవు చేర్చే బాధ్యత కెప్టెన్ గఫూర్ మీద పెట్టారు పాక్ అధికారులు. యాభైమంది సైనికుల సహాయంతో, రక్షణతో కోట్లకొలది విలువచేసే బంగారం, కరెన్సీనోట్లతో కెప్టెన్ గఫూర్ చిట్టగాంగ్‌కు బయలుదేరాడు.

ఢాకానుండి చిట్టగాంగ్‌కు వెళ్ళేదారి కొమిల్లామీదుగా

వెళ్ళవలసి వున్నది. సరిగ్గా కెప్టెన్ గఫ్ఫూర్ బృందం కొమిల్లా చేరేటప్పటికి, భారత సైన్యాలు అగర్తలా వైపు నుండి దూసుకురాసాగాయి. కొమిల్లా లోకల్ సెక్టర్ కమాండర్ కల్నల్ సింగ్వీ కొమిల్లాదాటి ముందుకు చిట్టగాంగ్ వైపు వెళ్ళడం ప్రమాదకరమని హెచ్చరించాడు.

చిట్టగాంగ్ రేవులో పాక్ జలాంతర్గామి ఇంకా వుండే అవకాశంలేదనీ, ఆ రోజే భారత విమానవాహక నౌక 'విక్రాంత్'కు చెందిన విమానాలు చిట్టగాంగ్ పైన భారీ ఎత్తున దాడి జరిపాయనీ తెలిపాడు కల్నల్ సింగ్వీ.

కెప్టెన్ గఫ్ఫూర్‌కు ఏమిచెయ్యాలో తోచలేదు. ఢాకాలోని హెడ్ క్వార్టర్స్‌కు ఇన్‌స్ట్రక్షన్స్ కోసం అడిగాడు. జవాబుకోసం కాచుకోమన్నారు అధికారులు.

ఢాకాలోని అధికారుల సలహాలు వినే సమయం లేకపోయింది కెప్టెన్ గఫ్ఫూర్‌కి. భారత సేనలతో తలపడిన పాక్ సైనికులు గంటల వ్యవధిలో యుద్ధరంగంనుండి పారిపోసాగారు. సెక్టర్ కమాండర్ సింగ్వీ కమాండ్ పోస్టు భారత శతఘ్నిగుళ్ళ దాడికి ధ్వంసమయింది. పాక్ సైనికులు కొమిల్లాను ఖాళీచేసి వెళ్ళడానికి ఆజ్ఞ ఇచ్చాడు సింగ్వీ. కాని సింగ్వీ మాత్రం తిరోగమిస్తున్న సైన్యాలతో వెనక్కి వెళ్ళలేదు. కెప్టెన్ గఫ్ఫూర్‌తో ఓ చిత్రమైన పథకం తయారుచేశాడు.

ధనం, బంగారం మనిషిలో చిత్రమైన మార్పు తెస్తుంది. క్రమశిక్షణ, కర్తవ్యం కోట్లకొలది ధనం శ్రమ లేకుండా స్వంతం చేసుకోనే అవకాశం వచ్చినప్పుడు తెలియకుండా మనుష్యుల్లోంచి మాయమవుతుంటాయి.

కెప్టెన్ గఫ్ఫూర్‌తోవున్న యాభైమంది సైనికుల సహాయంతో రిజర్వ్ బాంక్ నిధిని సరిహద్దు కొండలలోని మూసేసిన రాగి గనుల్లోకి చేర్పించాడు కల్నల్ సింగ్వీ.

గని ముఖద్వారాన్ని డైనమైట్‌తో పేల్చి మూసేశారు.

పని పూర్తయిం తరువాత సైనికులందర్నీ ఒకే వరసలో నిలబడమని ఆజ్ఞ ఇచ్చాడు కెప్టెన్ గపూర్. సైనిక శిక్షణలో గమ్మత్తు అదే. ఎదురు ప్రశ్న లేకుండా యాభైమంది సైనికులు వరసగా నిలబడ్డారు. మరుక్షణం వెనకనుండి కల్నల్ సింగ్వీ హైకాలిబర్ మిషన్‌గన్ గుళ్ళు వాళ్ళ శరీరాల్ని తూట్లుపొడిచాయి. యాభైమందిలో ఒక్కడూ బ్రతికి లేడని నిర్ణయించుకొన్నాక కల్నల్ సింగ్వీ, కెప్టెన్ గఫూర్లు పాక్ సైనికులతో ఢాకా చేరుకొన్నారు.

రిజర్వ్‌బ్యాంక్ నిధి భారత సేనల వశమయిందని, తన సిబ్బంది అంతా ప్రాణాలర్పించినా ట్రక్‌ను వెనక్కి తీసుకురాలేక పోయామని రిపోర్ట్ ఇచ్చాడు గపూర్. కెప్టెన్ గపూర్ రిపోర్ట్ నమ్మలేదు పాక్ అధికారులు. విచారణ పూర్తి అయ్యేవరకూ కెప్టెన్ గపూర్‌ను మిలటరీ జైల్లో పెట్టారు.

మిలటరీ జైల్లో ఎక్కువకాలం వుండాల్సిన అవసరం లేకపోయింది గపూర్‌కు. రెండుమూడురోజుల తర్వాత భారత సైన్యాలు ఢాకాను స్వాధీనం చేసుకొని, పాక్ సైనికులందర్నీ యుద్ధఖయిదీలుగా భారతదేశం తరలించారు.

* * *

నేను మంత్రించబడిన మనిషికిమల్లే సింగ్వీ కథనాన్ని చెవులప్పగించి వింటూ కూర్చున్నాను. మధ్యలో ప్రశ్నలు వెయ్యాల్సిన అవసరం లేకపోయింది నాకు. అన్ని విషయాలు వివరంగా చెప్పుకొచ్చాడు సింగ్వీ, నేను పదే పదే అడిగిన తర్వాత.

"ఆ తర్వాత?"—అన్నాను సగం ఆరిపోయిన సిగరెట్ మళ్ళీ వెలిగిస్తూ.

"ఆ తర్వాత విషయం నువ్వు ఊహించుకోవచ్చు,

మధ్యప్రదేశ్‌లోని 'గఢ్నా' యుద్ధఖయిదీల కాంపులో నుండి మేమిద్దరం తప్పించుకొన్నాము. ఎలా తప్పించుకొన్నామో చెప్పే ఓపిక లేదిప్పుడు నాకు. అదృష్టం మా పక్షాన వుంది. అంతే!

అసలు యుద్ధఖైదీలుగా మేము పట్టుబడతామనీ, తూర్పు పాకిస్తాన్ నామరూపాలు లేకుండా పోతుందనీ మేము ఊహించలేదు. యుద్ధం ఎలా జరిగినా ఆక్రమిత భాగాలన్నీ తిరిగి పాకిస్తాన్‌కు ఇచ్చివేయబడతాయని, తర్వాత నింపాదిగా ఆ బంగారాన్ని, కరెన్సీని మేం తెచ్చుకోవచ్చని అనుకొన్నాము. ఢాకాకు చేరుకొన్నాక ఆ నిధిలో ఆ వజ్రాలుకూడా వున్నాయని తెలిసినప్పుడు మా ఆనందానికి అంతులేదు.

కాని బంగ్లాదేశ్ ఏర్పడడంతో మా ప్లాను తారుమారయింది. మా ప్రభుత్వం భారతదేశంతో త్వరగా యుద్ధఖయిదీల సమస్య తేల్చేట్లు కనిపించలేదు. కోట్లకొలది విలువ చేసేధనం మాకోసం ఆ కొండగుహలో పడివుందనే ఆలోచన మా మనసుల్ని పురుగులా తొలిచింది. పి. ఓ. డబ్ల్యు కాంప్‌లోనుండి తప్పించుకొన్నాము. బంగ్లాదేశ్ లోపలకు వెళ్లడానికి పథకం తయారుచేసుకున్నాము. ఆ తర్వాత విషయం నీకు తెలిసిందే''—

అవును; ఆ తర్వాత కథ నాకు తెలిసిందే. ప్రిన్స్ ఖాట్టూమ్, బేబీ, దేవి, బొంబాయి, కలకత్తా కళ్ళముందు మెదిలాయి. నరకబడిన ప్రిన్స్ ఖాట్టూమ్ తల, బేబీ చిన్నారి ముఖం, క్రమశిక్షణవలన ప్రాణాలు పోగొట్టుకున్న యాభైమంది పాక్ సైనికులు. వీళ్ళు గుర్తుకొస్తే నాలో క్రోధం క్షణక్షణానికి పెరగసాగింది.

వీళ్ళిద్దరినీ చంపితీరాలి అనే నిర్ణయం మరింత దృఢమయింది. కాని; అప్పుడే కాదు. బేబీ సురక్షితంగా ఎక్క—

డుందో తెలుసుకోగానే వీళ్ళను శాశ్వతంగా ఈ లోకంలో నుండి తొలగించే ఏర్పాటు చెయ్యాలి.

# 12

సరిగ్గా రాత్రి పదకొండు గంటలకు తప్పించుకోనేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు వాళ్ళిద్దరూ.

ఆ భూగృహంనుండి బయటపడాలంటే పైకి వెళ్ళే ట్రాప్ డోర్ దగ్గరికి వెళ్ళాలి. ట్రాప్ డోర్ దగ్గరికే వెళితే, దానికి ఏ రకమైన తాళం వున్నట్లులేదు కాబట్టి తప్పించుకోవడానికి అవకాశం ఎక్కువుంది. కాని ముందు ఈ గది ఇనుప తలుపు తెరవగలగాలి.

తలుపుకు వేసిన తాళం గోడలోకి దించిన బోల్టుకు వుండడంవలన ఆ బోల్టు గోడలోవున్న భాగంలో సందు చేయగలిగితే తలుపు తెరిచే ప్రయత్నం చెయ్యొచ్చు. మేజోడులో దాచుకొన్న చాకుతో సందుచేయాలని ప్రయత్నించాడు గఫూర్. కాని అది రాతిగోడ కావడం వలన రోజంతా కష్టపడినా వేలుపట్టే సందుకూడా తయారుచేసే అవకాశంలేదు.

గడ్డు సమస్యలకు పరిష్కారాలు ఆలోచించడంలో సింగ్వీ మెదడు చురుగ్గా పనిచేస్తుంది.

మామూలుగా అడవుల్లో ఆయుధాలతో తిరిగేవాళ్ళు అమ్యునేషన్ క్లిప్పులు కాలి మేజోడులోనూ, బెల్టు సందుల్లోనూ పెట్టుకొంటారు. అలవాటుగా అలా పెట్టుకొన్న పిస్తోలు అమ్యునేషన్ క్లిప్పులు రెండు సింగ్వీ మేజోళ్ళలో వున్నాయి.

ఆ పిస్తోలు గుండ్ల కేసుల్లో గన్ పౌడర్ వుంటుంది. పిస్తోలు ట్రిగ్గర్ నొక్కినప్పుడు ఆ పౌడర్ పేలి, ఆ వత్తిడి వల్ల గుండు దూసుకెళుతుంది. గఫూర్ దగ్గరవున్న సూది

మొన చాకు సహాయంతో అతిచాకచక్యంగా పిస్తోలు బుల్లెట్స్, గుండు, కేస్‌లు విడదీశాడు సింగ్వీ. ప్రతి కేస్‌లోవున్న గన్ పౌడర్ని చిన్న కాగితంలో పోసి సన్నని శంఖు ఆకారంలో వుండే పొట్లంలా కట్టాడు. పొట్లంలో పౌడి వదులుగా వుండకుండా, గట్టిగా వుండేట్లు కూరాడు.

ఆ పొట్లాన్ని తలుపు గడి గోడలోకి వెళ్ళేచోట, తలుపుకు, గోడకుమధ్య ఇరికించాడు. తర్వాత లైటర్‌తో సిగరెట్ ముట్టించాడు. లైటర్ ఆర్పేసి, అందులో వత్తిగా వుపయోగించే దూది బయటకుతీసి మూడంగుళాలు పొడవుండే చిన్న వత్తిలా చేశాడు. ఆ వత్తిని సందులో ఇరికించిన పొట్లం లోపలికి అంటుకొనేట్లు అమర్చాడు. తర్వాత సిగరెట్ దమ్ము గట్టిగా పీల్చి ఆ వత్తి చివర అంటించాడు.

సింగ్వీ చేస్తున్న పనేమిటో తెలుసు కాబట్టి గదిలో వెనక గోడవారన నేను, గఫూర్ మో చేతులమధ్య తలలు పెట్టుకొని బోర్లా పడుకొన్నాము.

వత్తి అంటుకొని సరసరమంటూ కాలడం మొదలెట్టింది. సింగ్వీ ఎగిరి గోడవారగా బోర్లాపడ్డాడు. మరుక్షణం చిన్న మెరుపు మెరిసింది గదిలో. పెద్ద టపాకాయ పేలిన చప్పుడు వినిపించింది.

ప్రేలుడు తర్వాత గదంతా ఒక్క క్షణం పొగ ఆవరించింది. గంధకం కాలిన వాసన ముక్కుపుటాలకు తగుల్తోంది. ముగ్గురం లేచి తలుపు దగ్గరకు పరిగెత్తాం. శబ్దంవలన కొవ్వొత్తి ఆరిపోయి అంతా చీకటిగా వుంది. ఎవరో గట్టిగా తలుపును తన్నిన చప్పుడు. తలుపు బయట పెద్ద శబ్దంతో తెరుచుకోవడం జరిగాయి.

గన్ పౌడరు ప్రేలుడువల్ల గడవున్న రాయి కదిలింది. సింగ్వీ బలంగా తన్నడంవలన రాయి అవతలికి పడి తలుపు

తెరుచుకొంది. క్షణంలో ముగ్గురం కదలకుండా, ఊపిరి పీల్చకుండా నిలబడిపోయాం. ప్రేలుడు శబ్దం పైకి వినిపించిందో లేదో తెలియదు. శబ్దం వినిపించకపోయినా ప్రేలుడువల్ల కలిగిన కంపనం పైన ఎవరైనా వుంటే తెలుస్తుంది తప్పకుండా.

ముగ్గురం చీకట్లో తడుముకొంటూ ట్రాప్ డోర్ క్రిందకు వున్న నిచ్చెనవైపు నడిచాం.

పై గదిలో మా అదృష్టంకొలదీ ఎవరూ లేరు. ప్రక్క గదిలో గూడెం పెద్ద కాబోలు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. గది తలుపు తెరిచి ముందుగదిలోకి తొంగిచూశాడు సింగ్వీ. తర్వాత వెనక్కి తిరిగి గఫూర్ కి సైగచేసి పిల్లిలా ముందుకు కదిలాడు.

సన్నని దీపం వెలుగు కనిపిస్తోంది గదిలో. సింగ్వీ, గఫూర్ లు ఇద్దరూ నీడల్లా గోడకానుకొని నిద్రపోతున్న ఆకారంవైపు కదిలారు. మాకు ప్లేట్లో ఆహారం తెచ్చిన నాగా అతను. ఆ భూగృహంలోనుండి మేం తప్పించుకోవడం అసాధ్యం అన్న భరోసాతో బహుశా నిద్ర పోతుండి వుండాలి.

గఫూర్ చటుక్కున వంగి అతని ఒళ్లోవున్న స్టెన్ గన్ లాక్కున్నాడు. అదే క్షణంలో సింగ్వీ ప్రక్కనుండి అతని మెడచుట్టూ చెయ్యిపోనిచ్చి ఓ చేత్తో నోరుమూసి కత్తిపట్టుకున్న చేతిని అతని కళ్ళముందు ఎత్తిపట్టుకున్నాడు.

హఠాత్తుగా జరిగిన ఈ సంఘటనకు దిమ్మెరపోయినట్లు ఓ క్షణం కత్తివైపు, స్టెన్ గన్ తో నిలబడివున్న గఫూర్ వైపు చూశాడు ఆ నాగా. తర్వాత సింగ్వీ పట్టు విడిపించుకోవటానికి అటూ ఇటూ కదలసాగాడు.

"కాస్ట్రో ఎక్కడ?"—అన్నాడు సింగ్వీ అతని చెవి

దగ్గర నోరు పెట్టి మెల్లిగా. ఆ నాగా ప్రశ్న వినకపోతే కాళ్లు నేలకేసి మోదుతూ చప్పుడు చెయ్యడానికి ప్రయత్నం చెయ్యసాగాడు.

సింగ్వీ తన పట్టు మరింత బిగించి, కత్తి మొనను అతని కణతకు ఆనించి గట్టిగా నొక్కాడు. నాగా శబ్దం చెయ్యడం ఆపాడు. కత్తి గుచ్చుకొన్న చోట రక్తం సన్నధారగా అతని కంటిమీదకు కారుతోంది.

"కాస్ట్రో ఎక్కడ?"—అడిగాడు సింగ్వీ మళ్ళీ.

కిటికీలోనుండి ఎదురుగా కనిపిస్తోన్న గుడిసెవైపు చూపాడు వాడు.

"ఆ ఎదురు గుడిసెలోనా?"—

అవునన్నట్లు తల అటూ ఇటూ ఊపడానికి ప్రయత్నించాడు వాడు.

సింగ్వీ చెయ్యి వాడి నోటిని మరింత అదిమిపట్టింది. రెండవ చేతిలో కత్తి ఖస్సున వాడి ఎడమరొమ్ము క్రిందుగా దించాడు సింగ్వీ. దించిన కత్తి బయటికి లాగకుండా గాయంలో గుండ్రంగా తిప్పాడు. రక్తం రివ్వునచిమ్మి కత్తి పిడిపట్టుకున్న అతని చేతిని తడిపింది. ఆ నాగా ఒక్కక్షణం గిలగిల తన్నుకుని, చలనంలేని కట్టెలా అయిపోయాడు. అతనిలో ప్రాణంలేదని తెలుస్తూనేవుంది. నెమ్మదిగా నాగా శవాన్ని క్రిందపడుకోబెట్టాడు సింగ్వీ.

చేతికి అందిన రక్తాన్ని వాడిడ్రస్సుకు తుడిచేశాడు. అప్పటికే గఫూర్ ఎదుటి గుడిసెను, చుట్టూ తావున్న ప్రదేశాన్ని జాగ్రత్తగా పరీక్షిస్తున్నాడు.

"అతన్ని చంపేశావు"—అన్నాడు కోపంగా సింగ్వీతో గుసగుసలుగా.

"షటప్!"—అన్నాడు సింగ్వీ, గఫూర్ ప్రక్కకు నెట్టుతూ,

సింగ్వీ హంతకుడని తెలుసు. కాని నా కళ్ళముందు ఓ మనిషి నిలువునా పొడిచి చంపబడడం చూడడం నా జీవితంలో ఇదే మొదటిసారి. ఒక్క_క్షణం కళ్లు తిరుగుతా యేమోననుకున్నాను, కాని ఏంకాలేదు. ఇలాంటివి జీవిత మంతా చూడడం అలవాటుపడ్డ నాడిలా నా మనసు చలించలేదు.

గఫూర్ వెనక్కి_వచ్చి ఆ నాగా జేబులోవున్న స్పేర్ అమ్యూనిషన్ వెలికి తీసుకున్నాడు.

వెనకనుండి గఫూర్ స్టెన్ గన్‌తో కవర్ చేస్తూంటే సింగ్వీ పిల్లిలా ఎగురుటి గుడిసెవైపు పరిగెత్తాడు. సింగ్వీ గుడిసె దగ్గరకి వెళ్ళి చెయ్యి ఊపగానే గఫూర్ కూడా చప్పుడు చెయ్యకుండా అక్కడికి వెళ్ళాడు. ఈ సారి సింగ్వీ చెయ్యి వూపగానే నేను అవతలికి బయల్దేరాను.

ఎంత చప్పుడు లేకుండా వాళ్ళలా పరిగెత్తుదామన్నా సాధ్యమవలేదు. అంచేత గబగబా తేలిగ్గా అడుగులు వేస్తూ అవతలి గుడిసె దగ్గరకు నడిచాను.

గుడిసె తలుపు మూసివుంది. మెల్లిగా నెట్టి చూశాడు సింగ్వీ. తలుపు గడవేసివుంది. సింగ్వీ తలుపు దగ్గరనుండి రెండడుగులు వెనక్కి_వేసి ఎగిరి తలుపుమీద తన్నాడు. పెద్ద శబ్దంతో గడవూడి తలుపులు లోపలికి తెరుచు కున్నాయి.

వెంటనే గఫూర్ స్టెన్ గన్ బారెల్ కొద్దిగా పయికి లేపి ట్రిగర్ నొక్కాడు. నాలుగైదు మెరుపులు పెద్దశబ్దంతో పేలినయ్. క్షణంలో వాళ్ళిద్దరూ లోపలికి జొరబడ్డారు.

వాళ్ళిద్దరి సమయస్ఫూర్తికి, ధైర్యానికి ఆశ్చర్యపడ కుండా ఉండలేకపోయాను. కాస్తోస్తను నిరాయుధుడుగా గన్ ముందు నిలబెట్టితే మిగిలిన నాగాలందరూ లేచివచ్చినా తమకు అపాయంలేదనే విషయం దృష్టిలో పెట్టుకుని

వాళ్ళు ముందుకు దూకారు.

తలుపు తెరుచుకున్న వెంటనే కాస్ట్రో నిద్రలేచినా తొందరపడి మమ్మల్ని కాల్చకుండా ముందుగానే స్టెన్‌గన్ పేల్చి వార్నింగ్ ఇచ్చాడు గఫూర్. హఠాత్తుగా ఖయిదీలు తలుపులు తెరుచుకుని ఆయుధాలతో దాడిచేస్తే ఎవరైనా ఒక్క క్షణం స్తబ్ధులయిపోతారు. ఆ క్షణం చాలు సింగ్వీకి.

జరిగిన షాక్ నుండి ప్రియురాలి కౌగిలిలో నిద్రిస్తున్న కాస్ట్రో తేరుకోకముందే గఫూర్ స్టెన్‌గన్ అతని గుండెలకు ఆనించి వుంది. నమ్మలేనట్టు గన్ వైపు గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాడు కాస్ట్రో.

మంచంప్రక్కనేవున్న టేబిల్ మీద దీపం పెద్దగిచేసి కాస్ట్రోవైపు తీక్షణంగా చూశాడు సింగ్వీ. కాస్ట్రో ప్రియురాలు కెవ్వున కేక వేసి కాస్ట్రోని కదలకుండా మరింత గట్టిగా కావలించుకుని గఫూర్ వైపు పిచ్చిచూపులు చూస్తోంది.

గఫూర్ స్టెన్‌గన్ ధ్వనికి గూడెం అంతా క్షణాల మీద మేల్కొంది. నిముషంలో ప్రశాంతంగా వున్న గూడెం అరపులతో, కేకలతో, చిన్నపిల్లల ఏడుపులతో తుపాకులు పేల్చిన చప్పుడుతో అల్లకల్లోలంగా తయారయింది.

"ఆ డైమండ్స్ ఎక్కడ?" అన్నాడు సింగ్వీ తీక్షణంగా.

"నన్ను జయించి ఎంతో దూరం తప్పించుకుపోలేవు. ఈ వూరు దాటకముందే నా సోల్జర్స్ బులెట్స్‌కు చస్తావు"_అన్నాడు మేజర్ కాస్ట్రో గొంతు పెగల్చుకుని చివరికి.

"వేర్ ఆర్ ది డైమండ్స్?"_అన్నాడు సింగ్వీ అసహ

నంగా శాస్త్రి ఆచ్ఛాదనలేని జబ్బమీద కత్తి బలంగా దించుతూ.

శాస్త్రి బాధతో మూల్గాడు.

"ఎక్కడ పెట్టావు ఆ డైమండ్స్?"_అన్నాడు సింగ్వీ మరింత లోతుగా జబ్బలో కత్తి దించుతూ.

ఈ సరికే గూడెంలో జరిగిన విషయం అర్థమయి పోయింది. గుడిసెల బైట తుపాకులు పేలసాగాయి. నేను గుమ్మందగ్గరనుండి ఎగిరి గోడప్రక్కన నిలబడ్డాను. ఓ రైఫుల్ గుండువచ్చి గుమ్మానికి ఎదురుగావున్న పటానికి తగిలి ముక్కలు చేసింది.

"ఆస్క్ దెమ్ టు స్టాప్ దట్!" అరిచాడు సింగ్వీ.

"తొందర పడకండి. ఆగండి" అరిచాడు శాస్త్రి బిగ్గరగా.

శాస్త్రి స్వరం బయట జనం మీద మంత్రంలా పని చేసింది. బయట అరుపులు కేకలు తగ్గి నిశ్శబ్దం ఏర్పడింది శాస్త్రి ఏంచెప్తాడోనని.

"లిజన్! ఎవరైనా సాహసించి లోపలకు వచ్చారా, మరుక్షణం శాస్త్రి శవం బయిటికి పంపిస్తాము" అరిచాడు సింగ్వీ.

వెంటనే అరుపులు, కేకలు, రైఫుల్స్ పేల్చిన చప్పుడు వినిపించాయి. రైఫుల్ గుళ్ళు మందమైన మట్టిగోడకు తగులుతున్న చప్పుళ్లు వినిపిస్తున్నాయి. గఫూర్ గన్ మొనతో శాస్త్రి గుండెలమీద నొక్కాడు.

"స్టాపిట్! అతను చెప్పింది నిజం. దయచేసి ఎవరూ లోపలికి రావడానికి ప్రయత్నించకండి" మళ్ళీ అరిచాడు శాస్త్రి.

బయట జనం గోల కాస్త తగ్గింది.

"చెప్పు ఎక్కడ ఆ డైమండ్స్?" అన్నాడు సింగ్వీ

జబ్బమీద చేసిన గాయాన్ని కత్తితో అటూ ఇటూ కెలుకుతూ.

కాస్ట్రో ప్రియురాలికి ఆ హింస చూళ్ళేక స్పృహ పోయింది. కాస్ట్రో మాట్లాడలేదు. సింగ్వీ టేబిల్ మీద కుప్పగా పడివున్న కాస్ట్రో యూనిఫాంవైపు సైగ చేశాడు నాకు వెతకమన్నట్లు.

యూనిఫాం జేబులన్నీ చకచక వెతికాను. అందులో ఏమీలేవు. పెదవి విరిచాను సింగ్వీవైపు చూసి. సింగ్వీ కత్తి బయటకుతీసి కాస్ట్రో ఎడమ కంటికి తిన్నగా పెట్టాడు.

'కమాన్ కాస్ట్రో! చెప్పు! లేకపోతే ఈ కత్తితో నీ గుడ్లు పెళ్ళగిస్తాను'' అన్నాడు కర్కశంగా.

కాస్ట్రో నుదుటిమీదనుండి చెమటలు ధారాళంగా కారుతున్నయ్. సింగ్వీలాంటి క్రూరుణ్ణి బహుశా అతనెప్పుడూ చూసి వుండడు.

''ఓ. కె. నా పిస్టల్ కేస్‌లో చూడు'' అన్నాడు పెదిమలు నాలికతో తడుపుకొంటూ.

సింగ్వీ చటుక్కున వంగి మంచంకోడుకు తగిలించిన పిస్టల్ కేస్ తీశాడు. పిస్టల్ తీసి బల్లమీద పారేసి కేసు బోర్లా త్రిప్పి అరచేతిలో ఒంపాడు. ఆ చిన్న దీపం కాంతిలో గూడా గదంతా వింతవింత రంగుల్తో మిలమిల లాడిపోయింది.

సింగ్వీ, గఫూర్ల దృష్టి క్షణంపాటు ఆ డైమండ్స్ పైకి పోయింది. నేను మాత్రం అటు చూడటంలేదు. టేబిల్ మీద పెట్టిన పిస్టల్‌ని నిశ్శబ్దంగా తీసి జేబులో పెట్టుకొన్నాను. సింగ్వీ ఆ వజ్రాలు జేబులో వేసుకొని గఫూర్ వైపు తలపూపాడు.

''ఆల్ రైట్ కాస్ట్రో! గెటప్!'' అన్నాడు.

కాస్ట్రో మెల్లిగా లేచి నిలబడ్డాడు.

మేము మా 'లాండ్ రోవర్' వదిలివచ్చిన కొండల గుర్తులుచెప్పి, ఇక్కడకు ఎంతదూరం వుందని అడిగాడు సింగ్వీ.

"తూర్పున మూడు మైళ్ళ దూరంలో వున్నాయి" అన్నాడు కాస్ట్రో విషయం అర్థంకానట్లు.

"ఆల్ రైట్ కాస్ట్రో! నిన్ను మాతో షికాగుకు తీసు కెళతాము. నువ్వు ఎంత త్వరగా మమ్మల్ని అక్కడకు తీసుకెళితే నీకు అంత త్వరగా విముక్తి లభిస్తుంది. నీ అనుచరులెవర్నీ మనవెనక రావద్దని చెప్పు. గఫూర్ అసలే నర్వొస్ టైపు. ఏ మాత్రం అలజడి కలిగినా నీ తలకానించి వుంచిన గన్ ట్రిగ్గర్ నొక్కేస్తాడు" అన్నాడు స్వింగీ గోడకు తగిలించి వున్న మరో స్టెన్ గన్ అందుకొంటూ.

"నన్ను ఫ్రాంటియర్ పోలీసులకు అప్పజెప్పరుగా?" అన్నాడు కాస్ట్రో దీనంగా.

సంవత్సరంపాటు కొండల్లో దొంగలా బ్రతకడంవలన అతన్లో ధైర్యసాహసాలు చచ్చిపోయినట్లున్నాయి.

"డోన్ట్ వర్రీ అబవుట్ దట్! మేము అక్కడికి చేరుకోగానే నీ దారిన నీవు వెనక్కి వచ్చేయవచ్చు" అన్నాడు సింగ్వీ.

"ఆల్ రైట్!" అని బయట వాళ్ళను ఉద్దేశించి రెండు నిముషాలు మాకు తెలియని భాషలో ఏదో అరచి చెప్పాడు కాస్ట్రో.

బహుశా పరిస్థితిని వివరించి, మా వెనక ఎవర్నీ రావద్దని తన అనుచరులను హెచ్చరించినట్లున్నాడు. ఇంత పిరికి వాణ్ణి నమ్ముకొన్న ఆ అనుచరుల్ని చూస్తే నాకు జాలేసింది. అందరూ మౌనంగా వెళ్ళిపోయారు.

గూడెం ప్రజలనుండి, కాస్ట్రో విప్లవనాగా అనుచరు

ల్నుండి ఏ ఇబ్బంది లేకుండా మేము నలుగురు 'లాండ్ రోవర్' దాచిపెట్టిన కొండలవైపు నడక సాగించాము.

# 13

'బవేరా' గూడెం పొలిమేరదాటి ఓ ఫర్లాంగు నడిచాము. ముందు కాస్ట్రో, అతని వీపుకు స్టెన్‌గన్ ఆనించి గఫూర్, ప్రక్కన నేను, వెనుక మరో గన్‌తో సింగ్వి నడుస్తున్నాము. ఉన్నట్లుండి కాస్ట్రో చటుక్కున ఆగిపోయాడు.

"ఆగావేం?" అన్నాడు సింగ్వి.

మరుక్షణం సింగ్వి ప్రశ్నకు సమాధానం దొరికింది. దూరాన్న మోటారు జీపు శబ్దం వినిపిస్తోంది. మరుక్షణం జీపులైట్లు కనిపించాయి. కనీసం మూడు జీపులు.

"ఫ్రాంటియర్ పోలీస్! మావాళ్ళ రైఫిల్ చప్పుళ్లు విని ఇటుకేసి వస్తున్నట్లున్నారు" అన్నాడు కాస్ట్రో.

"క్విక్! ఆ కనిపించే బండరాళ్ళ వెనక్కు పరిగెత్తండి" అరిచాడు సింగ్వి.

ఫ్రాంటియర్ పోలీసుల జీపులు చాలా వేగంగా వస్తూ వుండివుండాలి. మాకు ఎదురుగా ఓ వందగజాల దూరంలో వున్న బండరాళ్ళకేసి పరిగెత్తాము. కాని రాళ్ళ చాటుకు వెళ్ళే లోపలే మొదటి జీపు హెడ్‌లైట్స్ కాంతి మామీద పడింది. ఎగిరి రాళ్ళచాటుకు దూకాను.

జీపు డ్రైవర్ మమ్మల్ని చూసి వుండాలి. చటుక్కున జీపులైట్లు ఆరిపోయినయ్. జీపు క్షణక్షణానికి దగ్గరవుతున్నట్లు శబ్దంబట్టి తెలుస్తోంది. నాలుగు జీపులు చీకట్లో మసగమసగ్గా కనిపిస్తోన్నయ్.

"మనం కనిపించినట్లున్నాం"—అన్నాను రొప్పుతూ.

సింగ్వి జాగ్రత్తగా బండచాటునుండి ప్రక్కకి తొంగి చూశాడు. రెండు రాళ్ళ సందునుండి మాకేసివస్తున్న

ఫ్రాంటియర్ పోలీస్ జీపులు స్పష్టంగా కనిపిస్తోన్నాయ్. చాలా నెమ్మదిగా ముందుకు కదుల్తోన్నాయ్.

నేను చుట్టూ చూశాను. మేము దాక్కున్న బండ రాళ్లు తప్పితే చుట్టూ అంతా మైదానం. తప్పించుకు పోయేందుకు ఎటూ దారిలేదు. మైదానంలో పరిగెడితే పిట్టల్లా కాల్చి చంపుతారు.

సడన్‌గా నాలుగు జీపుల్లో రెండు, ఒకటి ఎడమకు, ఒకటి కుడివైపుకు తిరిగాయి. కొంతదూరం ముందుకెళ్ళి గుండ్రంగా తిరిగి రాళ్ళకు రెండుప్రక్కలనుండి మాకు తిన్నగా రాసాగాయి. మేము అక్కడనుండి ఎటూ పారి పోలేమని వాళ్ళకు తెలిసుండాలి.

"గఫూర్! గెట్ రడీ టు ఫైర్"—అరిచాడు సింగ్వీ.

జేబులోనుండి పిస్టోలు తీశాను నేను. శాస్త్రి నేల మీద బోర్లాపడుకున్నాడు. నేను రెండుబండల మధ్య సాధ్యమైనంత దగ్గరగా ఇరుక్కున్నాను.

హఠాత్తుగా జీపులహోరు దగ్గరగా వినిపించింది. రెండు ప్రక్కలనుండి వస్తున్న జీపులు సడన్‌గా హెడ్‌లయిట్స్ వెలిగించాయి. అదేనో సిగ్నల్‌లా, వెంటనే బండల అవ తలవున్న రెండు జీపుల్లో వాళ్ళు మావైపు రైఫిల్స్ కాల్చడం మొదలుపెట్టారు. కాని ప్రమాదం మాత్రం ఈ రెండు జీపులవల్లే.

ప్రక్కలనుండి వస్తున్న రెండుజీపులవాళ్లు వెంటనే ఫైర్ ఓపెన్ చేశారు. హెడ్‌లయిట్స్ కాంతిలో మేము దాక్కున్న ప్రదేశం పట్టపగలులావుంది.

"ఫైర్"—అరిచాడు సింగ్వీ.

వెంటనే సింగ్వీ ఎడమవైపు జీపువైపు, గఫూర్ రెండవ జీపువైపు స్టెన్‌గన్స్‌తో ఫైర్ ఓపెన్ చేశారు.వీళ్లు స్టెన్‌లు

పేల్చడం ప్రారంభించగానే ముందుకువచ్చే జీపులు ఆగిపోయాయి. ఎడమవైపు జీపు హెడ్‌లయిట్స్ అద్దాలు పగిలి ఆరిపోయాయి.

"గుడ్‌వర్క్"—అన్నాడు శాస్త్రి నేలకు మరింత అతుక్కుపోతూ.

బులెట్లుమాత్రం వర్షంలాగా మావైపుకురుస్తూనేవున్నాయి. గపూర్ మాగజైన్‌లో గుళ్లు అయిపోయాయి. మాగజైను మార్చి ఇంకా ముందుకువస్తున్న కుడివైపు జీపుమీదకు కాల్చాడు. హెడ్‌లయిట్సు తగిలాయి. చటుక్కున చీకటైంది. ఎవరో బాధగా అరిచిన కేక వినిపించింది.

"అయామ్ హిట్!"—అరిచాడు గపూర్. గపూర్‌కు గుండు తగిలింది.

అప్పుడు తట్టింది నాకు. ఆ విషయం తెలుచుకోగానే గుండెలు దడదడలాడాయి. అవును. వీళ్లిద్దరూ పోలీస్ గుళ్లకు చచ్చిపోతే బేబీ ఎక్కడుందో ఎప్పటికీ తెలియదు. నేను రాళ్ళమధ్యనుండి జరిగి నేలమీద పాకుతూ గపూర్ పడినవైపు వెళ్లాను.

శాస్త్రి గపూర్ చేతిలో గన్ తీసుకుని జీపువైపు కాలుస్తున్నాడు. రెండోపక్క సింగ్వి వున్నట్టుంది. ఒక్కడూ బుల్లెట్స్ పేలుస్తున్నారు. పోలీసులుమాత్రం ఆగకుండా మావేపు కాలుస్తున్నారు. బండలచాటున పల్లంలో ఉండడంవలన చాలావరకు బులెట్స్ రాళ్ళకు తగుల్తున్నయ్. వీళ్లిద్దరూ కాలుస్తుండడంవలన వాళ్లు ముందుకు రావడానికి వీల్లేకుండా ఉంది.

"గపూర్! గపూర్!"—పిలిచాను.

గపూర్ మూలిగాడు సన్నగా. చేతితో తడిమాను. రొమ్ముమీద గాయం కనిపిస్తోంది. బ్రతికే ఆశలేదు. శ్వాస కూడా అతికష్టంమీద పీలుస్తున్నాడు.

"గఫూర్! చెప్పు... బేబీ ఎక్కడుంది?"_అరిచాను అతని చెవిదగ్గర.

గఫూర్ మళ్ళీ మూలిగాడు. నా చెవి అతని పెదవుల దగ్గరగా పెట్టాను. రైఫిల్స్ ధ్వనివల్ల ఏం వినిపించడం లేదు.

"బేబీ లేదు. వచ్చేముందు చంపి పాతిపెట్టాను. నిన్ను కూడా..."

ఆ తర్వాత గఫూర్ మాట్లాడలేదు. అతడిలో చలనం ఆగిపోయింది.

నాకు నెత్తిన పిడుగులు పడ్డట్లయింది. కళ్లు గిర్రున తిరగసాగాయి. వాడు వాడు ఆ సింగ్విగాడిని ముక్కలు ముక్కలుగా నరికి పాతేయాలన్నంత ఉద్రేకం, కోపం నాలో మిన్నుముట్టాయి. చటుక్కున పిస్టల్ తీసి సింగ్వీ తలకు గురిపెట్టాను.

అంతే! ఒక రైఫిల్ గుండువచ్చి నా కుడిబుజంలో దిగింది. బాధతో విలవిల్లాడిపోయాను. అయినా సింగ్విని వదలదలచుకోలేను.

మెల్లిగా పాక్కుంటూ సింగ్వీ దగ్గరకి జరిగాను. పిస్తోలు సింగ్వీ తలకు మళ్ళీ గురిపెట్టాను.

కాని, ట్రిగ్గర్ నేను నొక్కాల్సిన అవసరం లేక పోయింది. పోలీస్ పేల్చిన బులెట్ సింగ్వీ నుదురు మధ్యలో దిగిలింది. క్షణంలో అతని ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

—: ఐ పో యిం ది :—